# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ముక్కోటి ఏకాదశి ముస్తాబైన ఒంటిమిట్ట కోదండ రామాలయం

లోపలి పేజీలో


విజయవాడ | సంపుటి:13 | సంచిక:223 | శుక్రవారం | జనవరి 10, 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :8 | వెల:రూ 5/-

published from Vijayawada,Kakinada, Ananthapuramu, Kadapa, Eluru Circulated at AndhraPradesh & Telangana




# చంద్రబాబు గారికే ఇలా ఎందుకు..?

-ఆయన దర్శనం పై అంచనాలు కూడా వేయలేరా ..
-నెయ్యి లో ఉన్న నూతనోత్సాహం నేడు లేకపోయిందా..
-ముఖ్యమంత్రి ఆలోచన కూడా ఆచరించలేని అధికారులు అవసరమా..
-అపశృతి తో ఆలయ ప్రతిష్ట దెబ్బతిందా..
-సన్నగిల్లిపోతున్న సనాతన ధర్మంలో ఈ చావులు ఏమిటీ..
-ఈ సమాజంలో ఉండి కూడా చేష్టలుడిగిన పనులు చేస్తుంటే..
-తొక్కిసలాట మానవ తప్పిదమే కదా..
-ప్రజల ఆలోచన అంచనా వేయలేని వ్యవస్థ లో ఉన్నామా ..
-ఇంత పనికిరాని వ్యవస్థలో బ్రతుకు తున్నామంటే..
-చంద్రన్న పాలన పై ఛీత్కారాలు తెప్పించడమే గా..
-ఇది వైఫల్యమేనా లేక ఏదయినా లోపభూయిష్టం ఉందా..
-ఏడుకొండల వాడా ఏమిటయ్యా ఇది..

-నాడు గోదావరి పుష్కరాలు..
-నేడు తిరుమల వైకుంఠ ఏకాదశి దర్శనం..
-ప్రభుత్వ ఆశయాలు వీరికి పట్టవా ...
-భక్తులకోసమే అయినా భద్రత లో బాధ్యత లేదా ..
-బాబు గారి ఆలోచన భద్రతకు మించి ఉందా..
-కలియుగ దైవంపై ఇంత చిన్న చూపా ..

(రామమోహన్ రెడ్డి, సంపాదకులు)

అపదమ్రొక్కులవాడ అనాధ రక్షక అంటేనే అలసి పోయిన హృదయాలకు హాయిని ఇచ్చే ఆ కలియుగ వెంకటేశ్వరుని సన్నిధిలో ఇలా జరగడం అత్యంత బాధాకరం.ప్రపంచంలో నే అతిపెద్దహిందూ దేవాలయం గా ప్రసిద్ధ కెక్కి హైన్దవ సమాజానికి ప్రతీకగా నిలిచిన

మిగతా 2లో







## ప్రవాసి భారతీయ దివాస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రధాని

భువనేశ్వర్ : నేడు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన 18వ ప్రవాసి భారతీయ దివాస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మోడీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, విదేశాంగ శాఖామంత్రి ఎస్. జై శంకర్ ఘన స్వాగతం పలికారు. 'ప్రవాస భారతీయ దివాస్ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. దేశాభివృద్ధిలో భారతీయుల సహకారం మరువలేనిది. మన దేశ కళలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచం మొత్తం ప్రచారం చేసేందుకు మనమందరం ఈరోజు ప్రతిజ్ఞ చేద్దాం' అని ఆ రాష్ట్ర సిఎం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.కాగా, ప్రవాస భారతీయ దివాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు 50 దేశాలకు పైగా వివిధ దేశాల్లో నివశిస్తున్న భారతీయులు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకున్నారు.





## పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

-అనంతపురము పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ
-బెంగళూరులో సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎంపీ
-సి ఎస్ బి వైస్ చైర్మన్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పణ

ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని అనంతపురము పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ సెంట్రల్ సిల్క్ బోర్డు ఉన్నతాధికారులను కోరారు. బెంగళూరులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం జరిగిన సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

మిగతా 2లో






## ముగిసిన కెటిఆర్ ఎసిబి విచారణ



ప్రజాభూమిప్రతినిధి,హైదరాబాద్:-

ఫార్ములా-ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ పాత్రపై దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్ ప్రశ్నించగా జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. తనకున్న అవగాహన మేరకు సమాధానాలు ఇచ్చానని స్పష్టం చేశారు. ఏసీబీ అధికారులకు అన్ని విధాలా సహకరించానని, విచారణకు ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతానని కేటీఆర్ అన్నారు. ఇది ఒక చెత్త కేసు అని విచారణ అధికారులకు కూడా చెప్పానని వెల్లడించారు.అసంబద్ధమైన కేసులో ఎందుకు విచారిస్తున్నారని అడిగానన్నారు.

ఏసీబీ అధికారులు కొత్త ప్రశ్నలు ఏమీ అడగలేదని, నాలుగైదు ప్రశ్నలనే నలభై రకాలుగా అడిగారన్నారు.ఇది రాజకీయ కక్షపూరిత కేసు అని చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వ ఒత్తిడితో ఏం చేస్తున్నారో మీకే తెలియట్లేదని అధికారులకు చెప్పానన్నారు. రాజకీయ కేసు పెట్టి రేవంత్‌రెడ్డి సాధించేదేమీ ఉండదని చెప్పానన్నారు. ఏసీబీ అధికారులు మళ్లీ ఎప్పుడు విచారణకు పిలుస్తారో తెలియదని, ఏసీబీ అధికారులు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని కేటీఆర్ స్పష్టం చేశారు.



## తిరుపతి ఘటన నా మనసును కలచివేసింది..

- శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో ఎలాంటి అపశ్రుతీ జరక్కూడదు..
- తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా ఎప్పుడూ నిలబెట్టాలన్నదే నా తపన
- తిరుమల పవిత్రతను కాపాడే బాధ్యత నాది
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన నిర్ణయాలు
- ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం
- కాంట్రాక్టు ఉద్యోగాలూ ఇచ్చి అన్నివిధాలా ఆదుకుంటాం
- తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది
- మీడియాతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2



## అధికారులు చేసిన తప్పులకు మేం తిట్లు తింటున్నాం

-తిరుపతిలో తొక్కిసలాట బాధితులకు పవన్ కల్యాణ్ పరామర్శ
-అధికారుల తీరుపై ఆగ్రహం
-పోలీసులపై అనుమానం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం

# ఏలూరు జిల్లాలో యధేచ్ఛగా దోచేస్తున్న కసాయి..



(మత్తే బాబి,ప్రజాభూమి స్పెషల్ కరెస్పాన్డెంట్)

వడ్డించే వాడు మనవాడు అయితే బంతి లో ఎక్కడున్నా వడ్డింపు బాగానే ఉంటుందన్న చందంగా ఏలూరు జిల్లా కేంద్రంలో పేదల బియ్యాన్ని యథేచ్ఛగా దోచేస్తున్న కసాయి కి జిల్లా రెవెన్యూ అధికారులు అండదండలు పుష్కలం గా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో ఆటో బోలోరో వ్యాన్ ఇతర వాహనాల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలించి అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి కాసులు సంపాదిస్తుంటే కట్టడి చేయాల్సిన అధికారులు కామ్ గా ఉన్నట్లు తెలుస్తుంది. గత రెండు రోజులుగా ఏలూరుసత్రంపాడు, వంగాయగూడెం ప్రాంతాల నుండి ప్రభుత్వ

మిగతా 2లో

-ఆగని కసాయి రైస్ అక్రమ రవాణా..
-ఆమ్యామ్య లతో అలసత్వం వహిస్తున్న విజిలెన్స్..
-ఆధారాలు ఇస్తున్న కసాయిని కట్టడి చేయలేని స్థితిలో కరేప్షన్ అధికారులు..
-కరెన్సీ మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్నారేమో?
-కాసులిస్తే కసాయికి సి అంటున్న వైనం..
-కడుపు కాలినోడికి కూడు లేకుండా చేస్తారా..
-కడుపు నిండినోడికే కొమ్ము కాస్తారా...
-కూటమి ప్రభుత్వం లో ఇన్ని కుట్రలు జరుగుతుంటే కనపడవా
-డీఎస్ఓ దాడి చేసి పట్టుకోవడం లేదా...పట్టు కోల్పోయాడ...
-ఏ ఎస్ఓ కు ఇవన్నీ తెలియదా తెలిసినా తడబాటు లేదంటారా..
-ఎంఫోర్స్మెంట్ డీటీ ఏదైనా ఉందంటారా...
-పవన్ కళ్యాణ్,మనోహర్ మౌనంగా ఉంటారా...
-కసాయికి ఇక కళ్ళెం పడదంటారా...



## తాటతీస్తా... ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరిక



ప్రజాభూమిప్రతినిధి,పలాస:-చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుని కార్యక్రమాలతో అధికారుల స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు అప్రతిష్ట తీసుకొస్తే సహించేది లేదు నా పేరును దుర్వినియోగం చేస్తే ఖబడ్దార్! ఎమ్మెల్యే గౌతు శిరీష హెచ్చరించారు. నా పేరు దుర్వినియోగం చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారు, అటువంటి వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేసారు. ఇటీవలె చాలా విషయాలు తన దృష్టికి వచ్చాయని, అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు! అన్ని వర్గాల ప్రజలు బాగుండాలి.. అభివృద్ధి చెందాలనే సత్సంకల్పంతో ఉన్నాను ఇటీవల ఓ హోటల్ బిల్లు విషయంలో నా పేరు వాడిన సమాచారం ఉంది! అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, పోలీసులు కూడా ఉక్కుపాదం మోపుతారని, బాధితుల పక్షానే తాను నిలుస్తానని తెలిపారు. సేవ్ పలాస.. సేఫ్ పలాస నినాదంతో తాను ముందుకు సాగుతున్నానని, అధికారుల విధుల్లో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చినట్టు పేర్కొన్నారు. తన పేరును దుర్వినియోగం చేస్తూ డిమాండ్లకు పాల్పడిన వారి ఫోటో సమాచారం నా కార్యాలయ వాట్సాప్ నెంబర్ 9676448558 కు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

## ఏలూరు జిల్లాలో యధేచ్ఛగా దోచేస్తున్న కసాయి..

మొదటిపేజీ తరువాయి

ఆదాయానికి గండి కొట్టి సుమారుగా 30 టన్నుల వరకు పేదవారికి చెందవలసిన రేషన్ రైస్ తరలించినట్లుగా,కేవలం ఈ రెండు రోజుల్లోనే ఇంత తరలిస్తే నెల మొత్తం మీద సుమారుగా 150 నుండి 200 టన్నులు వరకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.ఇంత జరుగుతున్నా కూడా రెవెన్యూ అధికారులు విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకి తావిస్తోంది.ఇన్ని జరుగుతున్న ఆధారాలు తో సహా కథనాలను ఇస్తున్న ఈ అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోకుండా ఉంటున్నారనే అపోహలు వస్తున్నాయంటే కసాయి కాసులకు కక్కుర్తి పడిన కరెప్సన్ కోసం కసాయితో కుమ్మక్కై కడుపు కాలినోడికి ప్రభుత్వం అందిస్తున్న కోటా బియ్యం కడుపునిండి నోడికి దోచి పెడుతున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి గత ప్రభుత్వం లో కోటా బియ్యాన్ని కొల్లగొట్టారని అనేక కేసులు తనిఖీ లు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇలా అడ్డగోలుగా కొల్లగొడుతున్న కోటా బియ్యాన్ని తరలిస్తున్న కసాయిల పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఉన్న అలసత్వం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది కోటా బియ్యాన్ని సక్రమంగా కూటికి లేని పేదలకు చెరవేయాల్సిన సివిల్ సప్లై అధికారులు డీఎస్ ఓ కానీ ఏ ఎస్ ఓ ఇతర డీటీ లు మౌనంగా ఉన్నారా లేక వారు కూడా దండుగా నిలుస్తున్నారా అన్న ధర్మ సందేహం కలుగుతోంది. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల స్వయంగా వస్తేనే కసాయి లాంటి కోటా బియ్యాన్ని తరలించి కాసులు కూడా గట్టుకుంటున్న వరికి కళ్లెం వేస్తారేమో అన్న కామెంట్స్ వస్తున్నాయి. చూడాలి మరి ఈ కసాయి ఆగడాలు ఇంకెంత కాలం కొనసాగుతాయో..

## చంద్రబాబు గారికే ఇలా ఎందుకు..?





మొదటిపేజీ తరువాయి

వేంకటేశ్వరుని సన్నిదానం లో చావులు చోటుచేసుకోవడం విచారణకరం.లోపం ఎవరిదా అన్నదా ప్రక్కన బెడితే జరిగిన దుస్సంఘటన సనాతన ధర్మాన్ని మరింత సన్నగిల్లేలా చేస్తుందని చెప్పక తప్పడం లేదు.సనాతన ధర్మాన్ని పాటించే విషయం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న చిత్తశుద్ధి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఆయన ఆశయాలను కూడా అనుసరించకుండా అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పవిత్రతను దెబ్బతీసేలా జరిగిన పొరపాటు ఉందని చెప్పాలి. ఒక రోజు వైకుంఠ ఏకాదశి దర్శనము లో జరగని పొరపాటు భక్తుల బహుళ ప్రయోజనాలు ఆశించి పదిరోజుల పాటు అవకాశాలు వచ్చినప్పటికీ ఇలా జరగడం అనేది సనాతన ధర్మ పరిరక్షకులు జీర్ణించుకోలేక పోతున్నారు. గత ప్రభుత్వం కూడా ఇలానే చేసిన భక్తుల సౌకర్యాలలో ఏదయినా లోపాలు ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తాయి కానీ భక్తుల ప్రాణాలకు సంబంధించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసారన్నది వాస్తవం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవ్యాంధ్రప్రదేశ్ పునరేకీకరణ లో భాగంగా గోదావరి పుష్కరాలు తలపెట్టితే అనాడు అధికారుల తప్పిదమే కారణం గా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలో ఎన్నో కుంభ మేళాలు జరుగుతున్న ఇలాంటి దురదృష్టకర సంఘటనలు కూడా అరుదుగా జరిగినట్లు అపోహలు మాత్రమే వచ్చాయి కానీ పది రోజుల పాటు ఆపద మ్రొక్కులవాడి సన్నిధిలోనే ఇలా భక్తులు అసువులు బాపటం అనేది యావత్ హిందూ సమాజం తలదించుకునేలా చేసిందనే అపవాదు మూట గట్టుకునే విదంగా చేశారు ఈ నిర్లక్ష్యపు అధికారులు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత ఆయన ముందుచూపు పదే పదే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిశితంగా వివరించే ఉవిదానాన్ని కూడా ఉదాసీనంగా తీసుకవడం కూడా ఉన్నతాధికారుల తప్పిదమే అవుతుందని చెప్పాలి.అందులోనూ టీటీడీ అనేది స్వయం ప్రతిపత్తి కలిగి ముఖ్యమంత్రి కూడా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేని ఒక బోర్డ్ కలిగి ఉన్నా కూడా ఆలయ నిర్వహణ అధికారులు నిర్లక్ష్యంఉన్నట్లుగా కనిపిస్తుంది.

ఇప్పటికే సనాతన ధర్మం పై ఇతర మతాలు దాడి చేస్తూ హిందూ అస్తిస్త్వాన్ని అస్థిర పరిచే కుట్రలు జరుగుతూ మతోన్మాద శక్తులు సకల విధాలుగా ప్రయత్నిస్తున్న నేపధ్యంలో జరుగుతున్న దుస్సంఘటనలు యావత్ భారతావని ని కుంగదీసే విదంగా ఉన్నాయని చెప్పినా తప్పు కాదేమో అనిపిస్తుంది. కేవలం ఇలాంటి సంఘటనలు యాధృచ్ఛికంగా జరిగిన సనాతన ధర్మాన్ని క్షీణింప చేస్తాయని చెప్పాలి. ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే అతి ముఖ్యమైన ఈ రోజుల్లో ఏ సంఘటన జరిగిన జాతీ ప్రయోజనాలను కూడా పక్కన బెట్టి దుమారం రేపుతున్న దరిద్రపు పరిస్థితుల్లో బ్రతుకున్న హిందూ సమాజం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం నియంత్రణ లేని సామజిక మాధ్యమాల వల్ల జరిగిన నష్టం కొంత మేర బాదించిన జరగబోవు నష్టం తీరని అపార నష్టాన్ని తెచ్చిపెడు తొందని సనాతన ధర్మ పరి రక్షకులు ఆవేదన చెందుతున్నారు. అయితే జరిగిన దుస్సంఘట నిజంగా యాధృచ్ఛికమేనా లేక ఇందులో కూడా నీచమైన భావజాలం ఉన్న వ్యక్తుల వల్ల లోపభూయిష్టమైన విధానాల వల్ల జరిగిందా అన్నది ముఖ్యమంత్రి రహస్య నివేదిక ద్వారానైన పరిశీలనచేస్తే కొంత మేరైన మచ్చ పోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనపై నమ్మకం ఉన్న కొంత మంది పెద్దల మాటగా వినిపిస్తోంది.నెయ్యి లో ఉన్న అత్యుత్సాహం నేటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో శ్రద్ధ చూపించి ఉంటే ఇంత వైఫల్యం సంభవించేది కాదేమో అన్న పెదవి విరుపు కనిపిస్తుంది. ఏది ఏమైనా ముందు చూపు కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన లో ఇలా జరగడం విచారకరం. ఆ వేంకటేశ్వరుడి కృపా కటాక్షాలతో కుట్రలు ఉంటే కఠిన మైన శిక్ష వేయాలని కోరుకుంటూ కలియుగ ప్రత్యక్ష దైవం అందరిని కాపాడాలని కోరుకుంటుంది భక్త లోకం

## పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టు పరిశ్రమ అభివృద్ధికి అనేక కీలక అంశాలు ప్రస్తావించి, వాటిపై వినతి పత్రము సమర్పించారు. రైతులకు ఇన్సెంటివ్ అందించాలని, రీలింగ్ యూనిట్ మెషిన్లకు జీఎస్టీ రద్దు చేయాలని, రేకుల షెడ్డు నిర్మాణ నిధులను రూ.4.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచాలని, హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.8 కోట్లు, పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.5 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. ఈ సందర్భంగా సెంట్రల్ సిల్క్ బోర్డు వైస్ చైర్మన్ ను ఎంపీ, సిల్క్ బోర్డ్ సభ్యులతో కలసి, రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం విస్తృత నిధుల మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసారు. ఏపీలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేస్తానని వైస్ చైర్మన్ హామీ బాయ్ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

## తిరుపతి ఘటన నా మనసును కలచివేసింది..

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతి సంఘటన చాలా బాధాకరమైన ఘటన అని.. ఇది మనసును కలచివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం టీటీడీ పరిపాలన భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎప్పుడూ మనసా వాచా ఎలాంటి అపశ్రుతీ జరక్కూడదు.. పవిత్రమైన దివ్యక్షేత్రంగా ఎప్పుడూ నిలబెట్టాలన్నదే తన తాపత్రయమని.. ఓ భక్తునిగా, ముఖ్యమంత్రిగా తిరుమల దివ్యక్షేత్ర పవిత్రతను కాపాడే బాధ్యతను ఎప్పుడూ తీసుకుంటున్నానని.. ఇకపైనా తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.సంఘటన స్థలాన్ని చాలా నిశితంగా పరిశీలించి, ఆసుపత్రికి వెళ్లి అందరితోనూ మాట్లాడానని.. కొందరు తమ కుటుంబ సభ్యుల్ని, బంధువుల్ని, గ్రామస్థుల్ని పోగొట్టుకున్నవారు ఉన్నారని.. వారితోనూ మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం కార్యాలయంలో సమీక్షించామని, అన్ని కోణాల్లోనూ సమాచారం ఉంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సరైన నిర్ణయాలు తీసుకోవాలనేది తన ఉద్దేశమని తెలిపారు. బోర్డు ఛైర్మన్, ఈవో, సభ్యులకు కూడా స్పష్టమైన ఆదేశాలిస్తున్నా. నిర్ణయాలపై బోర్డులో చర్చించి, వాటిని అమలుచేస్తారు. ఈ పవిత్ర క్షేత్రంలో అసమర్థతతోగానీ, అనాలోచిత చర్యల వల్లగానీ చేసిన పనుల వల్ల పవిత్రత దెబ్బతినే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. తెలిసిచేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. అందరం కలిసి ఇక్కడ దేవునికి సేవ చేస్తున్నామనే భావన ఉండాలి. రాజకీయాలు చేయడానికి వీల్లేదు. రాజకీయాలకు అతీతంగా శ్రీ వేంకటేశ్వరునికి సేవచేస్తున్నామనే భావనతో అందరం ముందుకెళ్లాల్సిన అవసరముంది. భక్తుల మనోభావాల గురించి చెబుతూ కొండపై ఉన్నప్పుడు ఎంతసేపైనా క్యూలైన్లలో ఉంటాం. స్వామివారిని తలచుకుంటూ ఆయన లీలలు గుర్తుచేసుకుంటూ దేవుని సేవలో సన్నిధిలో ఉంటాం.. కానీ, తిరుపతిలో టోకెన్లు ఇవ్వడం మాకు సరైందని అనిపించడం లేదని భక్తులు చెప్పినట్లు ముఖ్యమంత్రి వివరించారు.జరిగిన సంఘటనపై విచారాన్ని వ్యక్తం చేస్తున్నా..వైకుంఠ ఏకాదశి.. ద్వాదశి.. రెండు రోజులు పవిత్రమైన రోజులు. అయితే పదిరోజులు చేశారని, ఎందుకు చేశారో తెలీదని, ఆగమ శాస్త్రాలు అనుమతిస్తాయో లేదో తెలీదని ముఖ్యమంత్రి అన్నారు. వేంకటేశ్వర స్వామి వెలసినప్పటి నుంచి ఏ సంప్రదాయాలు పాటిస్తున్నామో ఆ సంప్రదాయాలను ఉల్లంఘించడం కరెక్ట్ కాదనేది నా అభిప్రాయమని తెలిపారు. జరగరాని సంఘటన జరిగినద ౦నికి విచారణను, బాధను, ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని దేవాలయాలనూ స్ట్రీమ్ లైన్ చేసి ఎక్కడా అపచారమనేది జరక్కుండా అనేక సంస్కరణలు తీసుకొచ్చి.. ప్రసాదాల దగ్గరి నుంచి అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్న సందర్భంలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకర మన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని చాలా స్పష్టంగా చెబుతున్నట్లు తెలిపారు.ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ:ఘటనలో ఆరుమంది మరణి ౦ంచారని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు తక్షణమే ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని.. వారి కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని.. వీరికి రూ. 5 లక్షలు చొప్పున సాయమందిస్తామని, 33 మందికి గాయాలయ్యాయని వారికి రూ. 2 లక్షలు చొప్పున సాయమందిస్తామని ప్రకటి ౦ంచారు. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉందని.. దాన్ని నెరవేర్చేందుకు 35 మందికీ శుక్రవారం ప్రత్యేకంగా వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని తెలిపారు. వారికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు. డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారని, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి కూడా జవాబుదారీతనంతో పనిచేయలేదని వెల్లడైందని.. వీరిని సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు. ఎస్‌పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేస్తున్నామని, వాస్తవాలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తారన్నారు. మేనేజ్‌మెంట్, ఎగ్జిక్యూటివ్స్.. ఇంకా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని తెలిపారు. బోర్డు సభ్యులతో సహా ప్రతిఒక్కరూ సేవకులమనే భావనతో దేవుని సేవ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.ఈ పాత్రికేయ సమావేశంలో మంత్రుల బృందం రెవెన్యూ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, హోం మినిస్టర్ అనిత, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్ధసారథి, జల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎం ఎల్సిలు, టీటీడీ బోర్డు సభ్యులు తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## అక్కుపల్లి శివ సాగర్ సముద్ర తీరంలో బీచ్ క్లీనప్

ప్రజాభూమి,అక్కుపల్లి :

ఈవెంట్‌లను నిర్వహించడం ద్వారా మన సముద్ర తీరాన్ని శుభ్రంగా మరియు అందంగా ఉంచేందుకు యువత స్వచ్ఛందంగా, నిబద్ధతతో హృదయపూర్వకంగా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు, ఏ స్ స్ బి డి ఎ యువత 50కి పైగా క్లీనప్ ఈవెంట్‌లను నిర్వహించింది మరియు మన శివ సాగర్ బీచ్ నుండి టన్నుల కొద్దీ ప్లాస్టిక్ మరియు వేలాది గాజు సీసాలను తొలగించాము, వాటిని రీసైక్లింగ్ యూనిట్లకు పంపించాము. అదనంగా, సందర్శకులకు గొప్ప అనుభవాన్ని ఇవ్వడం కోసం చిరస్మరణీయమైన అనుభూతిని అందించడానికి రథ సప్తమి వంటి బహుళ కార్యకలాపాలను నిర్వహించాము. పరిశుభ్రతను కాపాడుకోవడానికి, ఆదివారాల్లో దుకాణాలు నిర్వహించే వాళ్లకి షరతులు విధించాము, వ్యర్థాలను సరిగ్గా పారవేసేలా వారిని ప్రోత్సహిస్తూ బీచ్ లో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశాముఈ క్రమంలో మన గ్రామం మరియుచుట్టుపక్కల గ్రామాల ప్రజల నుండి అద్భుతమైన మద్దతు లభించింది. బైపల్లి గ్రామానికి చెందిన మోసా మహావీర్ బీచ్‌లోని నీటి బావిని శుభ్రం చేయడానికి చొరవ తీసుకున్నారు, అదనంగా అక్కుపల్లి సర్పంచ్ లండ రామలింగం గారు బలమైన నాయకత్వం మరియు మద్దతు అందించారు.




అతను బీచ్ వద్ద సందర్శకుల కోసం వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు మరియు మా ప్రయత్నాలకు ఆర్థిక సహాయం కూడా అందించారు.సముద్ర తీరాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో మన యువత మరియు గ్రామ స్థులు అధిక ఉత్సాహాన్ని కనబరిచారు. సమావేశాల సమయంలో, అక్కుపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు బీచ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌కు వాళ్లు సహాయాన్ని అందిస్తూ సానుకూల మార్పు కొనసాగించడానికి మమ్మల్ని ప్రోత్స హించారు. 1986–87 10వ బ్యాచ్ (మైలపల్లి కామేశ్వర రావు మరియు అతని సహవిద్యార్థులు నాయకత్వం వహించారు) మరియు 1995–96 బ్యాచ్ (తమ సహవిద్యార్థులతో కలిసి లండ భీమరాజు మరియు తామడ శ్రీనివాసులు నేతృత్వంలో) నిధులు అందించారు. వారి సహకారంతో, బీచ్ ప్రాంతంలో చెత్త వేయకూడదని సందర్శకులకు గుర్తుచేసే సైన్‌బోర్డ్‌లను మన యువత ఏర్పాటు చేసింది.మాకు మద్దతునిచ్చి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ మేము ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.మన సముద్రతీరం యొక్క పరిశుభ్రత మరియు అందాన్ని కాపాడడానికి తమ వంతు సహకారాన్ని అందించాలని






సందర్శకులందరినీ దయతో అభ్యర్థిస్తున్నాము. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలకు చెందిన యువత, ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో మాతో కలిసి రావాలని మేము పిలుపునిస్తున్నాము. మన అందమైన సముద్ర తీరాన్ని కాపాడుకోవడంలో ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి. "మరోసారి, ప్రతి ఒక్కరికి మేము ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఏ స్ స్ బి డి ఎ ప్రయ త్నాలను ప్రజలందరూ కలిసి కొనసాగించాలి మరియు ఒక శాశ్వత పరిష్కారాన్ని తీసుకురావాలి!

## అధికారులు చేసిన తప్పులకు మేం తిట్లు తింటున్నాం



ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతిలోని బైరాగిపట్టెడ, విష్ణునివాసం వద్ద వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అధికారులు చేసిన తప్పులకు తాము తిట్లు తినాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తులు చేసిన తప్పులు ప్రభుత్వాలపై పడుతున్నాయని... తిరుపతి తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఈవో, టీటీడీ అదనపు ఈవో, ఘటన స్థలి వద్ద ఉన్న పోలీసులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఘటన స్థలం వద్ద టీటీడీ సిబ్బంది ఉన్నారు, పోలీసులు ఉన్నారు... అంతమంది ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందని అన్నారు. టీటీడీ ఇకనైనా వీఐపీల గురించి కాకుండా, సామాన్య భక్తులపై దృష్టి పెట్టాలని పవన్ కల్యాణ్ హితవు పలికారు. మృతుల కుటుంబాల వద్దకు వెళ్లి టీటీడీ సభ్యులు క్షమాపణలు చెప్పాలని అన్నారు.

ఏదేమైనా గానీ, తిరుపతిలో తప్పు జరిగిందని, అందుకు గాను మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి, శ్రీవారి భక్తులకు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణలు చెబుతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తిరుపతిలో తొక్కిసలాట జరిగిన పద్మావతి పార్కును పరిశీలించారు. స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

కాగా, ఈ ఘటనపై పలు అనుమానాలు కూడా కలుగుతున్నాయని, పోలీసుల్లో ఎవరైనా కావాలనే ఇలా చేశారా? అని సందేహంగా ఉందని అన్నారు. పోలీసులు అలసత్వంపై ముఖ్యమంత్రికి, రాష్ట్ర డీజీపీకి వివరిస్తానని తెలిపారు. తిరుపతిలో భారీ ఎత్తున వచ్చిన భక్తులను నియంత్రించే విధానం సరిగాలేదని, తొక్కిసలాట వంటి ఘటనలు జరిగినప్పుడు సహాయక చర్యలు ఎలా చేపట్టాలన్న దానికి కూడా సరైన ప్రణాళిక లేదని పవన్ విమర్శించారు.

## ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం పద్ధతి ద్వారా అధిక దిగుబడులు

ప్రజాభూమి పలాస:

పలాస డివిజన్ పలాస మండలం లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ ఏడిఏ శ్రీ మధుబాబు ,ఏవో పోలా రావు సమక్షంలో బంజీరి పేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నటు వంటి ఏటీఎం మోడల్స్ లను (నిరంతరం ఆదాయం), ఏ గ్రేడ్ మోడల్ ల ను పరిశీలించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం చేకూర్చుకోవచ్చని తెలిపారు అలాగే ఇందులో వేసే పంటలలో వంగ టమాట మిరప బెండ గోరుచిక్కుడు బరబాటి గోంగూర తోట కూర కొత్తిమీర క్యారెట్ ముల్లంగి బీన్స్ బొప్పాయి అరటి మొక్క జొన్న మొదలగు



పంటలు గూర్చి రైతులకు తగు సూచనలను ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేలుగు సంఘ సభ్యులు వి ఏ ఏ ఆశరాణి ,ఎస్ డి ఏ నాగరాజు, ఐ సి ఆర్ పి.పా పారావు, ఐ కూర్మా రావు, ఏ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ప్రజాభూమి



# వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు

## - భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు

## - ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నాం- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

శుక్రవారం ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని.. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి వివిధ ఆలయాల ఈవోలు, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు వచ్చే భక్తులకు ఆధ్మాత్మిక వాతావరణంలో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు సులభంగా దర్శనాలు జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని.. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వేదాద్రి నరసింహ స్వామి ఆలయం, నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, విజయవాడ బ్రాహ్మణ వీధి, లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద అసౌకర్యం అనే మాట లేకుండా క్యూలైన్లు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎస్ఐ తదితర క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పవిత్ర వైకుంఠ ఏకాదశి దర్శనాల ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పాట్లపై ప్రముఖ ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నామని.. దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందాలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఆలయాలను సందర్శించి పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు తదితరాల విషయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా దేవాదాయ అధికారి పి.సీతారామయ్య, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్, వివిధ ఆలయాల ఈవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి దుర్ఘటన అత్యంత విషాదకరం- డాక్టర్ ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

బుధవారం తిరుపతిలో తొక్కిసలాటలో చనిపోయిన వారి పవిత్రాత్మ లకు ప్రశాంతిని ప్రసాధించాలని భగవంతున్ని ప్రార్థిస్తూ వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ జనవరి 8 వ తేదీ టిటిడి చరిత్రలో ఒక చీకటి రోజన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకన్లు ఇచ్చే సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో తిరుపతి బైరాగి పట్టెడు కేంద్రం వద్ద బుద్ధేటి నాయుడు, మల్లికా, రజనీ, శాంతి, రాజేశ్వరి, నిర్మల అను 6 మంది చనిపోవడం బాధాకరం అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా టిటిడి యాజమాన్యం, ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి అని తులసి రెడ్డి అన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, బద్రి, వేమయ్య, నాగరాజు, వెంకటేష్, మహబూబ్ బాషా, మధార్, వినయ్, సాయి, వెంకట్, తేజ, లడ్డు, హేమంత్ ఉన్నారు.

# పట్టుదలతో శ్రమిస్తేనే విజయం సాధ్యం

## -వ్యక్తిత్వ వికాస నిపుణులు స్వామి బాలచంద్ర



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులు కష్టపడి కాకుండా పట్టుదలతో ఇష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధ్యమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సేవకులు స్వామి బాలచంద్ర పేర్కొన్నారు. హిందూపురం పట్టణం లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల పట్ల భయాన్ని తొలగించి ఆత్మస్థైర్యాన్ని నింపడం కోసం "గమ్యం" పేరిట స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి బాలచంద్ర మాట్లాడుతూ, పరీక్షలకు 63రోజుల సమయం ఉందని, ప్రణాళిక బద్ధంగా సమయాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. అభయ బిభవిత అనే కార్యక్రమం ద్వారా ఆడపిల్లల స్వీయ రక్షణ గురించి,ఆడబిడ్డల అభ్యున్నతి గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి సిద్ధగిరి శ్రీనివాస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, ఓరియంటల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబుళం , కృష్ణమోహన్ , ఫిజికల్ డైరెక్టర్ లోక్నాథ్, కార్యదర్శి రామాంజనేయులు, సీనియర్ ఉపాధ్యాయులు అమర నారాయణ రెడ్డిలతో పాటు వివిధ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

# విలేకరులను దూషించిన ఈ ఓ ఆర్ డి పై చర్యలు తీసుకోండి.

## సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య.



ప్రజాభూమి, పుట్లూరు

పుట్లూరు మండలం కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో విలేకరులను దూషించిన ప్రభుత్వ అధికారి విలేకరుల క్షమాపణ చెప్పాలని సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య కోరారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పెద్దయ్య మాట్లాడుతూపుట్లూరు మండలంలోని ఈ ఓ ఆర్ డి జిలాన్ భాష మీడియా వారిని నోటికొచ్చినట్లు దుర్భాషలాడడం దారుణం, మీడియా లో పనిచేస్తున్న సోదరులు అనునిత్యం ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉండి అధికార పార్టీ అయినా, ప్రతిపక్షమైన, రాజకీయ నాయకులు అక్రమాలకు పాల్పడిన, ప్రభుత్వ అధికారులు ప్రజలకు సరైన సేవలు అందించకపోయినా ప్రజల పక్షాన ఉండి అనునిత్యం ప్రజల తరఫున పోరాడే పత్రిక విలేకరులను ఇలా దుర్భాషలాడటం ఎంతవరకు సమంజసం ఇదే కాకుండా జిలాన్ భాష ఆఫీసుకు వచ్చిన ప్రజలతో కూడా దురుసుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. ఈ ఓ ఆర్ డి వెంటనే దురుసు తగ్గించుకోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీగా హెచ్చరిస్తున్నాం. మరోసారి ఇలా పత్రికా విలేకరుల పైన గాని, ప్రజలపై గాని దురుసుగా వ్యవహరిస్తే మీపై జిల్లా కలెక్టర్ కి అర్జీ ఇవ్వాల్సి వస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీగా ఈవో ఆర్డీ ని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలోఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు, రాజు, చేతి వృత్తిదారుల మండల అధ్యక్షుడు, ఓబులపతి, తక్కల్లపల్లి శాఖ కార్యదర్శి బాలు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎపి జెఏసి రాష్ట్ర స్థాయి కాలమానిని ఆవిష్కరణ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎపి ఉద్యోగుల జెఏసి అమరావతి రాష్ట్ర స్థాయి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ లను ఎపి జెఏసి జిల్లా చైర్మెన్, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశు మాట్లాడుతూ, ఎపి ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఎంతో ఆకర్షణీయంగా ఉందన్నారు. ఇందులో ఉద్యోగులకు అవసరమైన సమాచారంతో పాటు సెలవులు, ఐచ్చిక సెలవులు ఇతర సమాచారం పొందుపరచడం అందరికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, బాబయ్య, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కరువు సాయం నివేదికను కేంద్రానికి అందచేస్తాం- కేంద్ర బృందం

**రాష్ట్రంలో ఖరీఫ్ 2024 కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక**

**రైతులను ఆదుకోవడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలి..**

**- ఆర్పీ సిసోడియా**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఖరీఫ్ కరువు పరిస్థితులను అర్థం చేసుకుని సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో అధ్యాయనం చేసిన కేంద్రబృందాన్ని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్, విపత్తుల నిర్వహణ, స్టాంప్స్% డ% రిజిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో గురువారం కేంద్ర వ్యవసాయ %డ% రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించారు. కేంద్రబృందం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్ పెండిచర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి సుప్రియా మాలిక్, నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నా, %ణ/శీ% పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ కమిషనర్ డా. దీపాంకర్ సేథ్, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ప్రదీప్ కుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీ.మన్నూజీ ఉపాధ్యాయ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ జయంతి, ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డా. కె. పొన్నుస్వామి లు ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో భేటీయై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాలు (అన్నమయ్య – 19, చిత్తూరు – 16, శ్రీ సత్య సాయి – 10, అనంతపురం – 7 మరియు కర్నూలు – 2) ఇప్పటికే ప్రకటించడం జరిగింది. వీటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలు ఉన్నాయి. కేంద్ర కరువు నిబంధనల ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా అన్నారు కరువు ప్రాంత రైతులకు ఇన్పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ. 4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ %డ% రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి పెరిన్ దేవి మాట్లాడుతూ..కరువు కారణంగా నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని తెలిపారు. . అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని కరువు మండలాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను గమనించామని తమ నివేదికలో కేంద్రానికి అన్ని విషయాలను సమగ్రంగా తెలుపుతామని అన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు పరిస్థితులు స్పష్టంగా అర్థమవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో రైతులు కరువు వల్ల తమకు జరిగిన నష్టాన్ని వివరించారని తెలిపారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించి వీలైనంత మేర ఆదుకోవడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని పెరిన్ దేవి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పీఆర్, ఆర్డి, పశు సంవర్ధక శాఖ, పబ్లిక్ హెల్త్ మరియు అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు:మంత్రి సవిత వెల్లడి

**నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2024-25 ను ప్రారంభించిన మంత్రి**

**నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే లక్ష్యం**

**సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరించుదాం**

**మంత్రి సవిత**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ మరియు ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎగ్జిబిషన్లు, ఎక్స్ పోలు నిర్వహణతో చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగాయాని మంత్రి తెలిపారు. గురువారం ఆమె విజయవాడ నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2024-25) ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్ పో లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి, ఏ రాష్ట్రం నుంచి వచ్చారు...అమ్మకాలు ఎలా జరుగుతున్నాయి..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఎంతో కీలకమైన చేనేతకు సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించడానికి రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను నిర్వహిస్తున్నామన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్ పోలో 49 స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

చేనేతతో సంక్రాంతిని చేసుకుందాం...

చేనేత వస్త్రాలు తెలుగు సంప్రదాయానికి ప్రతీక అని మంత్రి సవిత తెలిపారు. రాబోయే సంక్రాంతికి ప్రజలంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని పిలుపునిచ్చారు. తెలుగింటి పెద్దపండగ సంక్రాంతిని చేనేతతో జరుపుకుందామన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని మంత్రి సవిత కోరారు.

365 రోజులూ పని కల్పిస్తాం...

చేనేత కార్మికులకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో సందర్శించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి సవిత మాట్లాడారు. రాష్ట్రంలో ఉప్పాడ జాంధాని చీరలు, మంగళగిరి చీరలు, వెంకటగిరి చీరలు, ధర్మవరం పట్టు చీరలు...ఇలా రాష్ట్రంలో 35 రకాల నాణ్యమైన చేనేత వస్త్రాలను నేతన్నలను తయారు చేస్తున్నారన్నారు. ఇలా తయారు చేస్తున్న చేనేత వస్త్రాలకు కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. చేనేతకు చంద్రబాబు పాలన ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నూతన టెక్స్ టైల్స్ పాలసీ అమలు చేయబోతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం చేనేత కార్మికుల్లో ఏర్పడిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ సాహూ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదనం ఉట్టిపడేలా నూతన శోభ సంతరించుకుంది.:కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్.

**మోడరర్ ప్రైమరీ సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న మంత్రి సుభాష్ .**



ప్రజాభూమి, రామచంద్రపురం.

మన సంస్కృతి సాంప్రదాయాలకు తెలుగుదనం ఉట్టిపడేలా మోడరన్ ఏ బి సి ప్రైమరీ స్కూలు ముందస్తు సంక్రాంతి సంబరాల్లో నూతన శోభ సంతరించుకుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామచంద్రపురం పట్టణం ముచిమిల్లిలో ఉన్న మోడరన్ ఎబిసి ప్రైమరీ స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు అకాడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా క్రీడా పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు . ప్రతి సంవత్సరం ఆహ్లాదకరమైన వాతావరణంలో సంక్రాంతి సంబరాలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు రమాదేవి తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమైన విషయమని పేర్కొన్నారు. వినూత్న కార్యక్రమాల ద్వారా పట్టణలో మోడరన్ విద్యాసంస్థల నందు సంక్రాంతి శోభను ముందే తీసుకురావటం మన సాంస్కృతి సాంప్రదాయాలకు ఎక్కడ జరుగుతున్న కార్యక్రమాలు నిలువుటద్దంగా నిలిచాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంక్రాంతి అంటే ఉమ్మడి కుటుంబాలకు నిలయంగా ఉండే సాంప్రదాయమైన పండుగని ఎక్కడెక్కడ ఉన్న కుటుంబ సభ్యులు అందరూ ఏకమై జరుపుకునే పండుగే సంక్రాంతి పండుగ ఆఅని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా విజేతలైన తల్లిదండ్రులకు మంత్రి సుభాష్ బహుమతులు అందజేసారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ సంక్రాంతి అంటే తెలుగు వారందరి పండుగని పేర్కొన్నారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో కొత్త కాంతి నింపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి వెంకటేశ్వర్లు మోడరన్ ప్రైమరీ స్కూల్ స్టాఫ్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# 9 సంవత్సరాల తర్వాత వైభవంగా ప్రారంభమైన ఆదిత్య కలర్స్ యూత్ ఫెస్ట్.



ప్రజా భూమి గండేపల్లి.

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో కలర్స్ 2025 యువజనోత్సవాలు ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైనాయి.మొదటి రోజు ఉదయం 9-30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జె.ఎన్.టి.యు.కె రెక్టార్ డా. కె.వి.రమణారావు, గౌరవ అతిథి గా ఐక్వడ్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్.ఎల్.సి ఫౌండర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు,పాల్గొనగా యూనివర్సిటీ ఉపకులపతి డా. ఎం.బి. శ్రీనివాస్, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఎంతో అలరించాయి.బెలూన్ లను ఎగరవేసి యువజన ఈ ఉత్సవాలు ప్రారంభించారు. విద్యార్థుల చే ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ , జెయింట్ వీల్ ,కొలంబస్,బ్రేక్ డాన్స్ వంటి వినోదభరిత వాతావరణంతో ఆదిత్య క్యాంపస్ అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు వివిధ రకాల ఫ్యాషన్ డిజైన్ లతో కూడిన వస్త్రధారణతో వారి చిరుదర హాసాలతో కలర్స్ నూతన శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా డా. సతీష్ రెడ్డి స్థానిక పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల విరామం తర్వాత ఆదిత్య కలర్స్ ఏర్పాటుచేయడం జరిగింది అని విద్యారుల ఉత్సాహం వారి కోరిక ప్రకారం ఇది ఏర్పాటు చేయక తప్పలేదు అని విద్యార్థుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని సినీ ప్రముఖుల సందడి ఆహ్లాదపరిచే లేజర్ షో విద్యారుల ఆటపాటలు ఈ కలర్స్ లో చోటు చేసుకున్నాయని సుమారు 50000 మందికి తగ్గకుండా పాల్గొంటారు అనే అంచనాలతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాట్లు సిసి కెమెరాల తో పర్యవేక్షణ రవాణా సౌకర్యాలు భోజనం వసతులు అన్ని సమకూర్చడం జరిగింది అని ప్రతి విభాగానికి టీమ్ లను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. స్పోర్ట్స్,గేమ్స్ సాంస్కృతిక విభాగాలలో పాల్గొనడానికి వివిధ కళాశాలల నుండి సుమారు 2000మంది విద్యార్థులు రిజిస్టర్ కావడం జరిగింది అని 67 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం జరిగింది అని సతీష్ రెడ్డి తెలిపారు. మొదటి రోజు హీరో నిఖిల్ రెండవ రోజు కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్, మూడవరోజు కిరణ్ అబ్బవరం రానున్నట్లు తెలిపారు.



## బాల్యం నుండే సామాజిక సమస్యల పట్ల స్పందన అభినందనీయం.

### ఎస్సై దుర్గా మహేశ్వర రావు.

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



బాల్యం నుండే సామాజిక సమస్యల పట్ల స్పందించడం అభినందనీయమని స్థానిక ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు అన్నారు. స్థానిక విద్యా రోహిణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సేకరించిన రూ. 71,425 సహాయ నిధిని గురువారం విజయవాడ స్నేహ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్ పీపుల్ ఆర్గనైజర్ వెంకటరమణకు ఎస్ ఐ డి.దుర్గా మహేశ్వర రావు చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా బుట్టాయిగూడెం స్టేషన్ హౌస్ ఆఫీసర్ దుర్గా మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం అభినందనీయం అన్నారు. బాల్యం నుంచే సామాజిక బాధ్యతతో ఉండడం వలన దేశం పట్ల సాటి మనుషుల పట్ల సరియైన అవగాహన కలుగుతుందని తెలిపారు. సహాయ నిధిని సేకరించిన విద్యార్థులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులందరూ చదువులో బాగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొండేపాటి రామకృష్ణ, పాఠశాల సిబ్బంది, స్నేహ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కె కోట డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజా భూమి, కామవరపుకోట



స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు అధ్యక్షతన తెలుగు విభాగం మరియు సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ మన సంస్కృతి సాంప్రదాయాలను పాటించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలనియు సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ జి శ్రీనివాసరావు మన తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగోళి మరియు భోగి మంటలు వేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ వేడుకలలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు, ఐక్యూ ఏసి కో–ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం ఉషారాణి, కె ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, పి ఏడుకొండలు, ఎం విజయ కృష్ణ, ఉమ, ఆఫీస్ సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్న సిరిలో కుమార్ రాజా మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులలో దేశభక్తి, సేవభావం

ప్రజా భూమి, ఏలూరు



ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలలో పి యం శ్రీ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యా యులగా హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల వేగవరంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా ఆరవ రోజున స్కౌట్ జెండా , జాతీయ జెండా ఆవశ్యకత పై, స్కౌట్ మాస్టర్, గైడ్ టీచర్స్ కు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా స్కాప్ ధరింప జేయుట, హైకింగ్, ఫైర్ క్యాంప్ మొదలైన విషయాలు వాటిపై డి.ప్రసాద్ ఏ యల్ టి , ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు , గైడ్ వింగ్ కు,రేలంగి ధనలక్ష్మి ఏ యల్ టి , కె పద్మ ప్రి ఏ ఎల్ టి, సౌజన్య, శ్రీదేవి,శ్రీమతి చాంద్ బీబీ అడ్వాన్స్ అనువారు ఉపాధ్యా యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన స్కౌట్స్ మరియు గైడ్స్ ద్వారా పాఠశాలలోని యూనిట్ విద్యార్థులకు దేశభక్తి, సేవభావం అలవడుతుందని తెలిపారు.

## శాంతినికేతన్ హైస్కూల్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాభూమి, ప్రొద్దుటూరు



పట్టణంలోని శాంతినికేతన్ హైస్కూల్ లో గురువారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా సరదాగా చిన్న పిల్లలతో ఆటపాటలలో పాల్గొన్నారు. మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో చక్కటి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డ్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి గారు మరియు కరెస్పాండెంట్, టీచర్లు పాల్గొన్నారు.

## మోయడానికి మేమున్నాం అంటున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

ప్రజాభూమి, ప్రొద్దుటూరు:



స్థానిక చంద్ హాల్ గేట్ నందు రాజు(63) అనే వృద్ధుడు మరణించగా, మృతదేహాన్ని గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ నందు ఉంచగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు లేకపోవడంతో ఓ విలేఖరి ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబాహాన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి గురువారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, కృప అగ్ని శరూన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టీ వెంకటలక్ష్మమ్మ,సుమన్ బాబు, శ్రీరామ్, రమేష్, సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజా భూమి ప్రతినిధి పిఠాపురం

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం భాష్యం స్కూల్లో సంక్రాంతి సంబరాలు వైఎస్ఆర్ గార్డెన్స్ పిఠాపురం భాష్యం స్కూల్ నందు సంక్రాంతి సంబరాలను ముందుగానే 9 జనవరి ఘనంగా నిర్వహించారు.సంక్రాంతి సంబరాల్లో భాగంగా భాష్యం స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు హరిదాసు,గోదాదేవి,శ్రీకృష్ణుడు,గంగిరెద్దు అలాగే సాంప్రదాయ వస్త్రధారణలో వచ్చి అందరిని అలరించారు.పాఠశాల ప్రిన్సిపల్ పోలిపర్తి వేణు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలను భాష్యం స్కూల్లో ముందుగానే నిర్వహించడం ద్వారా తమ విద్యార్థిని విద్యార్థులకు సంక్రాంతి పండగ యొక్క విశిష్టతను అలాగే మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని తెలిపారు.సంక్రాంతి అనగా రైతుల పండగ అని రైతులను ఎప్పుడూ మనం గౌరవించాలని అలాగే పశువులను పాడిపంటలను పూజించాలని ప్రిన్సిపల్ వేణు వివరించారు.ఈ కార్యక్రమంలో భోగి మంటలు,బొమ్మల కొలువు,అందంగా అలంకరించిన ఎడ్ల బండి ,ఆవు,దూడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం ప్రిన్సిపల్ పోలిపర్తి వేణు,ప్రైమరీ హెచ్ఎం.అరుణ,పాఠశాల తల్లిదండ్రులు చిన్నారులకు భోగిపళ్ళను పోసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రంగవల్లుల పోటీలను భాష్యం పాఠశాల ఆడపడుచులకు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రిన్సిపల్ పోలిపర్తి వేణు ప్రైమరీ హెచ్ఎం అరుణ అందజేశారు.పాఠశాల ప్రాంగణం అంతా రంగవల్లులతో సంక్రాంతి పండుగ శోభతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు,తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## కలియుగ వైకుంఠ స్వామి వారితో పెట్టుకున్న వాళ్లు బట్ట కట్టిన దాఖలు లేవు

### మృతిచెందిన కుటుంబాలకు 50 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రజా భూమి, జీలుగుమిల్లి



కలియుగ వైకుంఠ స్వామి వెంకటేశ్వర్లు తో పెట్టుకున్న ఏ ఒక్కరు కూడా బట్ట కట్టలేదని అనేక రోజులు ఉన్నాయని దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు ఒక ప్రకటనలో అన్నారు. పి .అంకంపాలెంలో దళిత సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తగరం రాంబాబు ఆయన నివాసం లో పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న తిరుపతి దేవస్థానంలో జరిగిన సంఘటన దుర దుష్టి కరంతిరుమల ఏడు కొండల స్వామి వారి వైకుంఠ ద్వారా దర్శనంలో జరి గిన తొక్కిసలాటలో నిన్న ఆరుగురు మృతి చెందారు. 34 మంది రుయా ఆస్పత్రిలో 14 మంది స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం కోరితే ఏకంగా వైకుంఠానికి పంపించిన ఘనత టీటీడీ చైర్మన్ మరియు పాలక వర్గానికే చెందుతుందని ఎద్దేవా చేశారు. తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది అని ముందస్తు సమాచారం ఉన్న నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాలకవర్గం పై అక్కడి సెక్యూరిటీ సిబ్బంది పై హత్య యత్నం కేసులు నమోదు చేయాలి, పాలక వర్గాన్ని రద్దు చేయాలి అలాగే ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ నిరంతరం పర్యవేక్షిం చాల్సిన హోంమంత్రి దేవాదాయ శాఖ మంత్రి నైతిక భాధ్యత వహించి మంత్రి పదవులకు రాజీనామా చేయాలి. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన కలియుగ దైవం ప్రతిష్టకు ఇలాంటి దురదృష్ట కర సంఘటనల వలన భక్తుల్లో భిన్న అభిప్రాయాలు వచ్చే అవకాశం ఉంది గతంలో లడ్డు ప్రసాదం విషయంలో చేసిన అసత్య ప్రచారం వలన భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించారు. ఇలాంటి వరుస సంఘటనలు చూస్తుంటే ఒక పథకం ప్రకారమే కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ప్రతిష్టను మసకబార్చే కార్యక్రమానికి తెరలేపినట్టున్నారు. అనే భావం హిందూ సమాజంలో గూడు కట్టుకునే ప్రమా దం కనపడుతుంది. ఈ దుర దుష్ట కరమైన సంఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తో విచారణ జరిపించాలి. చనిపోయిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం కింద ఒక్కొక్క మృతునికి 50 లక్షల రూపాయలు ఇవ్వాలి. క్షత గాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలి వైద్యం ఖర్చులు టీటీడీ ఏ భరించాలి. సనాతన ధర్మ పరి రక్షణ నా ధ్యేయం అంటూ హడావిడి చేసిన గౌరవ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఈ సంఘటనపై నోరు విప్పకపోవటం చాలా బాధాకరం అని తగరం రాంబాబు అన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేసేంతవరకు పోరాటం ఆగదు

### పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బండి విజయభాస్కర్.

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలుచేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేసేంతవరకు తమ పోరాటం ఆగదని పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బండి విజయభాస్కర్ అన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, డిసిసి అధ్యక్షుడు రాజనాల రామ్మోహ న్రావు ఆదేశాల మేరకు పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బుట్టాయ గూడెంలో కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి దేవప్రియు డుకు, అంబేద్కర్ కాలనీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్, పార్టీ నేతలు మాట్లాడుతూ అంబేద్కర్ పై వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదని, దశలవారీగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దేశ ప్రజలకు ఒక మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆధారంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో డాక్టర్ అంబేద్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు అంబేద్కర్ గౌరవానికి విఘాతం కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేసుకుంటూ, అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిడిపి కుటుంబరావు (బుట్టాయగూడెం), గద్దె రాజు( కుకునూరు), కొల్లూరి సత్యనారాయణ (వేలేరుపాడు), అల్లి కిషోర్ (జీలుగుమిల్లి), దారం సత్తిరాజు (కొయ్యలగూడెం),ముచ్చిక సీత (పోలవరం), డిసిసి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కూనపాము రాజారత్నం, ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కంగాల శ్రీరామ్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆమర్తుల యేసు పాదం, సీనియర్ నాయకులు రఘు, కుంజా భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య హై స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాభూమి, వేంపల్లె





స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్ లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు భోగి మంటలతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు. వారి ప్రతిభ ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేసింది. అలాగే పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు గురువారం ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు.

వివిధ వర్గాల్లో పోటీలు నిర్వహించగా, విజేతల సంప్రదాయమైన ముగ్గులు అందరినీ ఆకట్టు కున్నాయి. పాఠశాల డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి మరియు బి. చైతన్య రెడ్డి విజేతలను అభినందించి, వారి సృజనాత్మకతకు ప్రశంసలు కురిపించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేయగా, ఉపాధ్యాయులు పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగాలు చేశారు. భోగి మంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పండుగను ఆత్మీయ వాతావరణంలో జరుపుకున్నారు.



## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజా భూమి ఒంటిమిట్ట:



ఆకట్టుకున్న గొబ్బెమ్మలు ఉత్సాహంగా ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఒంటిమిట్ట , జనవరి 9 కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహిం చిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకు న్నాయి. విద్యార్థులు మామిడి ఆకులు, అరటి పిలకల తో పాఠశాలను అందంగా ముస్తాబు చేశారు. పాఠ శాల యజమాన్యం విద్యా ర్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యా ర్థులు సాంస్కృతిక కార్యక్ర మాలలో ఉత్సాహంగా పాల్గొ న్నారు. భోగి మంటలను వేశారు. చిన్నపిల్లలకు భోగి పండ్లను సాంప్రదాయ బద్ధంగా తలపై పోసిన కార్యక్రమం విశేష ముగా ఆకట్టుకుంది. కోడిపం దాలు, హరిదాసు కీర్తనలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ రామ తులసి మాట్లాడుతూ విద్యా ర్థులకు సంక్రాంతి విశిష్టత, గొప్పతనం తెలియజేసేం దుకు ముందస్తు సంక్రాంతి సంబరాలను పాఠశాలలో నిర్వహిస్తు న్నామన్నారు. సాంప్రదాయబద్ధంగా గొబ్బెమ్మల ఉత్సవ పాఠశాలలో నిర్వహించిన మొత్తం కార్యక్రమానికి గొబ్బెమ్మల ఉత్సవము ప్రధాన ఆకర్షణగా నిలచింది. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమ తంగేడు పూలు గురువింద గింజలు తెల్లబట్ట ఇతరపుష్పాలతో అందంగా తయారుచేసిన గొబ్బెమ్మను జల్లెడలో ఉంచారు. అందంగాలంకరించిన ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలను ఉంచి, విద్యార్థులు ఆడి పాడారు. చివరగా గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుబ్బరామయ్య, సురేష్, పద్మ, రాజా, శివ నాయక్ ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ సుందర సీతారామ చంద్రస్వామి తెప్పోత్సవం

ప్రజాభూమి, వి.ఆర్.పురం



రెండో భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని పురాతన పుణ్యక్షేత్రమైన, శ్రీరామగిరి గ్రామం వద్ద, శబరీ గోదావరి సంఘము తీరములో వెలసియున్న సుందర సీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్ద, ముక్కోటి ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై మేళ తాళాలతో ఆలయ ప్రధాన అర్చకులు పురుషోత్తమాచార్యులు వేదమంత్రోచ్చారణలతో భక్తుల రామనామస్మరణలతో కొండపై నుంచి గోదావరి నది ఒడ్డు వరకు శ్రీరామ్ గిరి పురవీధుల్లో ఊరేగింపుగా స్వామి వారిని తీసుకొని వచ్చి తెప్పోత్సవం కు సిద్ధం చేసిన లాంచీలో ఉంచి తెప్పోత్సవం కార్యక్రమాన్ని ముక్కోటి ఏకాదశి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు,



గ్రామంలోను, గోదావరి నది రేపు వద్ద పరిసరాలను శుభ్రం చేయించారు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు గోదావరి నదిలో స్వామి వారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహాలను పుష్పాలతో అలంకరించి, లాంచిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి, స్వామివారిని తెప్పలపై ఉంచి నదిలో విహరింపచేసారు. ఈ దృశ్యం భక్తుల మనసులను ఆకట్టుకుంటుంది, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్ఐ సత్యనారాయణ ఈ తెప్పోత్సవం కార్యక్రమానికి తమ సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరస్వతి, ఏ ఎస్ డి ఎస్ అధినేత వి గాంధీబాబు, దేవాదాయ శాఖ అధికారులు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, బిరపు ప్రకాశరావు, బొర్రా నరసింహారావు, తెప్పోత్సవం ఉత్సవ కమిటీ సభ్యులు సభ్యులు పెందుర్తి సుదర్శన్ రావు, నాళ్లారపు సత్యనారాయణ, కోట్ల రామ్మోహన్ రెడ్డి,ఆలయ ధికారులు సాయిబాబు, జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, కార్యదర్శి బాగుల అంజన్ రావు, గ్రామస్తులు ఆత్మకూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
రాజమహేంద్రవరం,

## ఏరియా హాస్పిటల్లో మోడ్రన్ ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు పౌష్టికాహారం పంపిణీ...!





ప్రజాభూమి ,రామచంద్రపురం.

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో స్థానిక మోడ్రన్ డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సంయుక్తంగా ఆసుపత్రిలో గల పేషెంట్లకు పండ్లు పౌష్టికాహారం ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రిలో ఇన్ పేషెంట్,అవుట్ పేషెంట్ రోగులకు పండ్లు మరియు వేరుశనగ అచ్చులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జి. మాణిక్యం, ఏ శ్రీనివాస్ , ఎన్ . సుధాకర్ ,స్థానిక జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ గొల్లపల్లి కృష్ణ గారు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జీవి రావ్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లో సేవాదృక్పథం అలవరుచు కోవడం, మంచి ఆలోచనా దృక్పథంతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడంతో ఇక్కడ పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను ఈసంధర్బంగా ఆయన అభినందించారు.

## సన్ షైన్ హైస్కూల్లో అంబారాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు...!





ప్రజాభూమి ,రామచంద్రపురం.

రామచంద్రపురం పట్టణంలో గల సన్ షైన్ హైస్కూల్ లో కరస్పాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంక్రాంతి ముందస్తు సంబరాలు అంబరాన్ని తాకేలా స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు ఆటపాటలు , సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. రంగవల్లి పోటీలు నిర్వహించారు విజేతలకు బహుమతులు అందజేశారు. తొలిత కరస్పాండెంట్ సురేష్ హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు, సంయుక్తంగా భోగమంటను వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే ఇక్కడ విద్యార్థులు వేషధర్మ ఆహుతులను ఆకట్టుకోగా సాంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతికి గుర్తుకొచ్చేవి . హరిదాసు వేషధారణ, కోడిపందాలు వంటే రకరకాల కార్యక్రమాలు నిర్వహించడంతో ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## అక్రమ మైనింగ్ కు వినియోగిస్తున్న మూడు పొక్లెయిన్ లు సీజ్ - జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం



బుర్రిలంక ఇసుక రిచ్ పాయింట్ వద్ద అక్రమ మైనింగ్ కు వినియోగిస్తున్న మూడు పొక్లెయిన్ లు సీజ్ కడియం మండలం వేమగిరి సమీపంలోని బుర్రిలంక గోదావరీ పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా కోసం అక్రమ మైనింగ్ చేస్తున్న నేపథ్యంలో రెవిన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా అక్రమ వ్యాపారులు తీరు మారలేదని అన్నారు. ఇటువంటి వాటి విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## జగన్నాథగిరిలో ఎస్ఎస్సి మెటీరియల్ పంపిణీ!





ప్రజాభూమి రామచంద్రపురం.

రాజలూరు మండలం జగన్నాద్గిరి జిల్లా పరిషత్ హై స్కూల్లోమాజీ ఎంపీటీసియాళ్ళ చంద్ర శేఖర్ చే జగన్నాదగిరి ఉన్నత ఎస్ఎస్సి మెటీరియల్ పంపిణీ జరిగింది.పాఠశాల 10వ తరగతి విద్యార్థులు 38 మందికి యుటిఎఫ్ చే ముద్రించబడిన ఎస్ ఎస్ సి మెటీరియల్ ఉచితంగా అందజేసారు.ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కాజులూరు మండల యుటిఎఫ్ ఆడిటర్ కే.రవి కుమార్ దాతలతో మాట్లాడి సహృద్భావ హృదయం కలిగిన యాళ్ళ చంద్రశేఖర్ని కలిసి విద్యార్థుల మెటీరియల్ అందించడంలో కీలకపాత్ర పోషించారు.ఈ కార్యక్రమంలో పెనుమల్ల మాజీ ప్రెసిడెంట్ వీరబ్రహ్మం, ఎంపీటీసీ కొప్పురం లక్ష్మి ,పాఠశాల ఛైర్మన్ ,జగన్నాదగిరి ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ భాయ్ , వెంకటరావు ,విజయ ,కమల కుమారి , ఇతర ఉపాధ్యాయ బృందం స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో వృద్ధుడు సజీవ దహనం

ప్రజాభూమి తుని

తుని లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది.తుని పట్నంలో రామకృష్ణ కాలనీ జ్యోతి నగర్ బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆ పూరి గుడిసెలో నివసిస్తున్న తాతపూడి చెన్నయ్య( 64) అనే వృద్ధుడు సజీవ దహనం అయ్యాడని పట్టణ సిఐ గీత రామకృష్ణ తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు

## చోడిశెట్టి కుటుంబాన్ని పరామర్శించిన ముద్రగడహేమశంకర్ కు ఘన నివాళి

ప్రజా భూమి తుని



సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి కుటుంబాన్ని కాపు ఉద్యమనేత వైకాపా నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన చోడిశెట్టి హేమశంకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ముద్రగడ ఎస్ అన్నవరం వచ్చారు చోడిశెట్టి త్రిమూర్తి స్వామిని పరామర్శించిన ముద్రగడ పద్మనాభం,హేమశంఖర్ కు నివాళులు అర్పించారు.నరిశే శివాజీ,రాపేటి పెద్ద , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## పోషన్ ప్లస్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం

**అదనపు పోషక ఆహారం గా మునగాకు పొడి జంక్ ఫుడ్ కి దూరంగా ఉండండి.. నిత్య ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోండి**
**- కలెక్టర్ పి ప్రశాంతి**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

మీ సమయాన్ని ఆరోగ్యానికి సరిపోయేలా చేసుకొనే అవకాశం మీ చేతుల్లో ఉందని .. అది మిమ్మల్ని ఆరోగ్యవంతంగా చేస్తుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు.గురువారం స్థానిక పోస్టు మెట్రిక్ బాలికల వసతి గృహంలో జిల్లా యంత్రాంగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇతర సమన్వయ శాఖల ఆధ్వర్యంలో పోషన్ ప్లస్ కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, కౌమార దశ లోని ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో కార్యకలాపాల్లో భాగస్వామ్యం పోషన్ ప్లస్ కింద ఐరన్ మాత్రలు తో పాటుగా మునగాకు పొడి వసతి గృహాలలో ఉన్న బాలికలకు అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎనీమియా లోపం వల్ల రక్త హీనత కలిగి కళ్ళు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతూ ఉంటాయని, మనం తీసుకునే ఆహారంలో తప్పకుండా ఐరన్ పోషకాలు అందుతున్నయో లేదో నిర్ధారణ చేసుకోవడం ముఖ్యం అన్నారు. జిల్లాలోని



సంక్షేమ వసతి గృహాలలో ఉన్న బాలికలకి మునగాకు పొడి అందచేసి మంచి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. పిల్లలు చిన్నతనం నుంచే ఆరోగ్యమైన ఆహారపు అలవాట్లు చేసుకొవాలని , ఆమేరకు వారిలో అవగాహన కల్పించడం ముఖ్యం అని తెలియ చేశారు. గతంలో చిరు ధాన్యాలు, రాగులు జొన్నలు సజ్జలు ఆహారంలో తీసుకునే వారన్నారు. నేడు ఫాస్ట్ ఫుడ్, పోషక విలువలు లేని ఆహారం తీసుకోవడం వల్ల రక్త హీనత కు గురి అవ్వడం చూస్తున్నామని తెలిపారు. కౌమార దశలో ఉన్న బాలికలకు మునగాకు పొడర్ ఇవ్వటం జరుగుతోందనీ, రోజు విడిచి రోజు తప్పకుండా ఆహారంలో మునగాకు తీసుకోవడం వల్ల రక్త హీనత ను అధిగమించడం సాధ్యం అవుతుందని అన్నారు. ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాలలో ఉన్న బాలికలకు ప్రభుత్వం అందచేస్తున్న వాటికి అదనంగా "ప్రాజెక్ట్ ఐరెన్ ప్లస్ " కార్యక్రమం ద్వారా మునగాకు పోడి అందజేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వీటికి అదనంగా కరిపాకు, క్యారెట్ తదితర పోషక విలువలు కలిగిన వాటిని మీ శరీరతత్త్వం, వయస్సు ఆధారంగా తీసుకోవడం ముఖ్యం అన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై , మంచి పోషక విలువలు కలిగిన ఆహారంలో తప్పకుండా తీసుకుని రావడం పై జిల్లా వ్యాప్తంగా యుక్త వయసులో వున్న బాలికలు భవిష్యత్తులో కూడా కొనసాగించేలా ముందుకు రావాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు. జిల్లాలో ఎస్సి ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలలో సుమారు కౌమర దశలో ఉన్న బాలికలు 2793 మందికి మురింగా (మునగాకు) పొడి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థులకి స్వయంగా ఆహారాన్ని వడ్డించిన కలెక్టరు ప్రశాంతి.ఈ కార్యక్రమము లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. వెంకటేశ్వర రావు, అధ్యక్షతన జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ ఎన్. వసుంధర , ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే ఎన్ జ్యోతి, సోషల్ వెల్ఫేర్ ఆఫసర్, ఎం. శోభా రాణి , జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ బి . శశాంక, డి ఆర్ డి ఎ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎస్. ఎస్. లక్ష్మి కాంతి, డాక్టర్ ఎ. వి. కె. చైతన్య, డాక్టర్ ఎ. భావని, విద్యార్థినీ లు పాల్గొన్నారు.

## ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ " దరఖాస్తులు స్వీకరణ

**దరఖాస్తు చేసుకున్న వారి జాబితా వెబ్ సైట్ లో అప్లోడ్ చెయ్యడం జరిగింది**
**ఈనెల 16 వ తేదీ సా 5 వరకూ అభ్యతరాల స్వీకరణ**
**- కలెక్టరు పి ప్రశాంతి**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా, కలెక్టరు వారి కార్యాలయం నందు ఖాళీగా ఉన్న "ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ " పోస్టునకు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయుటకు గాను సెప్టెంబర్ 22 తేది నోటిఫికేషన్ ద్వారా అభ్యర్థుల నుండి ధరఖాస్తులను సెప్టెంబర్ 23 తేది నుండి అక్టోబర్ 2 తేది వరకు స్వీకరించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ పి



ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలియచేసారు. అభ్యర్థుల నుండి స్వీకరించిన ధరఖాస్తుల పరిశీలన తరువాత తాత్కాలిక జాబితా ను రూపొందించి https://eastgodavari.ap.gov.in అను వెబ్ సైటు నందు పొందుపరచబడినట్లు తెలిపారు. ఈ జాబితా లో ఏమైనా అభ్యంతరములు / ఫిర్యాదులు ఉన్నచో 10 తేది నుండి 16 తేది సాయంత్రం 5 గంటల లోపు కలెక్టరు వారి కార్యాలయం, పరిపాలన అధికారి విభాగము నందు తగిన ఆధారములతో సమర్పించాలని పేర్కొన్నారు.

జనవరి 16 వ తేదీ సాయంత్రం 5.00 గంటల తరువాత ఎటువంటి అభ్యంతరములు / ఫిర్యాదులు స్వీకరించబడవు. అభ్యర్థుల నుండి స్వీకరించిన అభ్యంతరములు / ఫిర్యాదులు పరిశీలన తరువాత తుది అర్హుల జాబితా మరియు అనర్హుల జాబితాలు వెబ్ సైటు నందు పొందుపరచబడును https://eastgodavari.ap.gov.in పొందుపరచిన Grievance Application లో మాత్రమే పూర్తిచేయవలెను, లేని యెడల అటువంటి అభ్యర్థనలు పరిగణలోనికి తీసుకొనబడవు అని పేర్కొన్నారు.

## మృతి చెందిన నలుగురు కుటుంబాల వారికి జెకేసి ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాభూమి, వి.ఆర్.పురం.

ఇటీవల మండలంలో నలుగురు మృతిచెందగా మృతి చెందిన వారి కుటుంబాల వారికి జెకెసి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విఆర్ పురం వద్ద మృతుల కుటుంబాలకు 5000 రూపాయలు చొప్పున వితరణను స్థానిక జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి చేతుల మీదుగా వితరణను పంపిణీ చేశారు. వడ్డే గూడెం గ్రామానికి చెందిన పుల్లిందల సత్యవతి, విఆర్ పురం బీసీ కాలనీకి చెందిన సవలం నాగు, రేఖ పల్లి గ్రామానికి చెందిన మడకం సిరమయ్య, అడవి వెంకన్న గూడెం గ్రామానికి చెందిన కూర దేశయ్యలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు నేడే వితరణను అందించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు మాట్లాడుతూ ఎవరు ఎక్కడ నిరుపేదలు చనిపోయిన, ప్రకృతి విపత్తుల సంబంధించి ఇల్లు కోల్పోయిన నిరుపేదలకు




కులమత బేధాలు చూడకుండా, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్, ముందుండి సహాయం చెయ్యడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జీడిగుప్ప ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్, ముత్యాల చంద్రశేఖర్, పురోహితులు మల్లాది శేఖర్ శాస్త్రి, మల్లికార్జున రావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామి వివేకానంద స్కూల్లో "ముగ్గుల పోటీలు

ప్రజాభూమి, వి.ఆర్.పురం

కూనవరం మండలం భీమవరం గ్రామంలో "శ్రీస్వామి వివేకానంద స్కూల్' నందు విద్యార్థిని విద్యార్థులకు 'ముగ్గులు పోటీలు 'కార్యక్రమంని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలంతా ఉత్సాహంగా పాల్గొని 'రంగురంగుల ముగ్గులు 'వేయడం జరిగింది. ఈ ముగ్గులు చూడటానికి గ్రామస్తులంతా రావడంతో పాఠశాల ఆవరణమంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా" శ్రీ స్వామి వివేకానంద' స్కూల్ ప్రధానోపాధ్యాయులు 'కాకునూరు కృష్ణార్జునరావు" మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 'సంక్రాంతి'కి ముందు ఈ 'ముగ్గుల పోటీ'ని నిర్వహించడం జరుగుతుందని, ఈ సంవత్సరం కూడా చాలామంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని, ఇటువంటి కార్యక్రమాలు మన "సంస్కృతి సాంప్రదాయాలకు' అద్దం పడుతుందన్నారు. ఈ ముగ్గుల పోటీలో సీనియర్స్ నుంచి మొదటి బహుమతి కి "కర్నాటి జాహ్నవి', 'రెండవ బహుమతి'



కి"బడుగు హిమవర్షిని,' మూడో బహుమతి 'కి సిర్ర మనస్విత, వెల్లంకి భవ్య శ్రీ ఎంపిక అయ్యారు. జూనియర్స్ నుంచి మొదటి బహుమతి కి గోళ్ళహర్షిత, నందికొండ ధరణి, రెండో బహుమతి కి "కారం మాన్విత శ్రీ,' వెల్లంకి రేష్మ. ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయులు శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు...! వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తొగరు మూర్తి

ప్రజాభూమి,రామచంద్రపురం

శ్రీకృతివెంటి పేర్రాజు పంతులు ఆదర్శనీయులని యోగ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తొగరుమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు రామచంద్రపురం పట్టణంలో గురువారం కృత్తివెంటే పేర్రాజు పంతులు జయంతిని తొగరు మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.తొలుత పేర్రాజు పంతులు విగ్రహానికి యోగ వాకర్స్ పెద్దలు గొల్లపల్లి కృష్ణ పూలమాలవేసి జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తూ ఆయన త్యాగాలను, ఆశయాలను ప్రతి ఒక్కరు అలవరుచు కోవాలని పిలుపునిచ్చారు.అనంతరం జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి తొగరు మూర్తి మాట్లాడుతూ పేదరికం చదువుకి అడ్డు రాకూడదని 1906 వ సంవత్సరంలో తన కష్టార్జితంతో, మేధస్సుతో సంపాదించిన 99 ఎకరాల భూమిని, రామచంద్రపురం పట్టణంలో విశాలమైన కళాశాలను నిర్మించి విద్యావ్యక్తికి, క్రీడల అభివృద్ధికి దానంగా ఇచ్చారు.99 ఎకరాల భూమిలో వచ్చే ఆదాయంతో ఉద్యానవన కళాశాల,పశు సంవర్ధక కళాశాల, వ్యవసాయ కళాశాలలు పేర్రాజు పంతులు ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్మించి మహాదాతగా మానవులలో మహానీయుడిగా శ్రీ పేర్రాజు పంతులుని నిలిపారని తొగరు మూర్తి తెలిపారు.పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో కళాశాలలో చదువుకున్న డాక్టర్ చెలికాని స్టాలిన్,డాక్టర్ రామారావు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తూ డాక్టర్ గా సమాజ సేవ



చేస్తున్నారని అన్నారు.స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు,మోడరన్ కళాశాలల వ్యవస్థాపకులు డాక్టర్ లయన్ జి వి రావు,ఆర్టోస్ సాఫ్ట్ డ్రింక్స్ కంపెనీ అధినేత అడ్డూరి జగన్నాథరాజు వర్మ,మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ బి.వి పట్టాభిరామ్,చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొవ్వూరి తాతారెడ్డి వంటి విశిష్టమైన వ్యక్తులు పేర్రాజు పంతులు వారి కళాశాలలో చదువుకున్న వారేనని తెలిపారు.బ్రిటిష్ కాలంలోనే స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన దాత పేర్రాజు పంతులని తెలిపారు.వారి త్యాగాలను, స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను నెరవేరుస్తూ సమాజంలో ఉన్నత లక్ష్యాల వైపుకు చేరుకోవాలని విద్యార్థినీ విద్యార్థులకు తొగరు మూర్తి పిలుపునిచ్చారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని,విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సమావేశంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పెంటపాటి అన్నవరం,అంకం శ్రీనివాస్,పామర్తి మధు,బలుసు శ్రీనివాస్ చౌదరి,శాఖా వీరన్న,వీరా శ్రీను,కూ%శీ%ద్రపు శ్రీనివాస్,పరసవేది బాబ్జి,మహమ్మద్ ఉన్నిసా బేగం, మహమ్మద్ షరీఫ్,అన్నంనీడి మల్లేశ్వరరావు,గుబ్బల శ్రీనివాస్, వర్ధినిడి సత్తప్ప నాయుడు, సాయిరాం,శీలం గోవిందు, చలపతి, ఎండోమెంట్స్ రవి, యోగా గురువులు విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## కె.వి.ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన కమిషనర్, మాజీ డైరెక్టర్

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోని సెంట్రల్ బోలె వార్డు ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా కె వి ఆర్ ఫ్యామిలీ రెస్టా రెంట్ ను నూతనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభో త్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సి పల్ కమిషనర్ రాముడు, మాజీ చైర్మన్ రసూల్, మాజీ డైరెక్టర్ అంబక పల్లె నారాయణ స్వామిలు హాజరై రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్ ను ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెూటల్ కు వచ్చే కస్టమర్లతో క్రమశిక్షణతో మెలిగి మంచి పేరు తెచ్చుకోవాలి అన్నారు. రుచికి ,శుచికి, శుభ్రతకు మారుపేరు కె.వి.ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్ అని వచ్చిన కస్టమర్లే పదిమందికి చెప్పే విధంగా ఉండాలన్నారు. అనంతరం ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని రమణ మాట్లాడుతూ ఉదయం ఇడ్లీ, పూరి, దోశ, మధ్యాహ్నం, రాత్రికి చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీలతోపాటు చేప పులుసు జొన్న రొట్టెలు ప్రత్యేకంగా పెట్టడం జరిగిందన్నారు. అలాగే గతంలో వేమారెడ్డి హెూటల్ ను తలపించే విధంగా ఉదయం దోష, మటన్ శార్వా ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో అంకాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ ప్రసాద్, సురేంద్రనాథ్ రెడ్డి,గంగిరెడ్డి, సోఫాల వీర, తదితరులు పాల్గొన్నారు.

## కంపోస్ట్ యార్డ్ ను పరిశీలించిన కమిషనర్ రాముడు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోని కంపోస్ట్ యార్డును గురువారం మున్సిపల్ కమిషనర్ డి. రాముడు మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంపోస్టు యార్డు లో నూతనంగా ఏర్పాటు చేయుచున్న చెత్తను వేరు చేయు మిషన్ ను పరిశీలించి, చెత్త వేరు చేయు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మిషన్ నందు ఎటువంటి సాంకే తిక సమస్యలు రాకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భవతులకు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభయాన్ పథకం పై అవగాహన

ప్రజా భూమి ముద్దనూరు



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధి కారులు శ్రీకాంత్, నాగార్జున ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం గురించి గర్భవతులకు గురువారం అవగాహన జరిగింది జరిగింది. ఈ సమావేశానికి 26మంది గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. వీరికి సంబంధిత సిబ్బంది గర్భవతులకు చేయించాల్సిన పరీక్షలు అన్నీ చేయించారు. వీరిలో ఇద్దరు హై రిస్క్ గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. వీరికి వైద్యాధి కారులు శ్రీకాంత్ నాగార్జున కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. అనంతరం వైద్యాధి కారులు మాట్లాడు తూ హైరిస్క్ గర్భిణీ స్త్రీలు వైద్యాధి కారుల పర్య వేక్ష ణ లో ఉండాలని పోషకాలు కల్గిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు తీసుకొనే ఆహారం లో ప్రతి రోజు ఆకు కూరలు, గ్రుడ్డు భుజించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రం లో ఇచ్చే గ్రుడ్లు, పాలు, బాలా మృతం తప్పకుండ ఉపయోగించు కోవాలని తెలిపారు. ప్రతి నెల తల్లి, బిడ్డ పెరుగు దల ఎలా ఉందో తెలుసు కోవాలని గర్భిణీ స్త్రీలకు తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రతి రోజు వ్యా యామం, నడక పాటించాలని వైద్యాధి కారులు అన్నా రు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వఆసుపత్రికి వచ్చికాన్పు చేయించు కోవాలని 108,102వాహనాలను ఉపయోగించు కోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పారితోషి కాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆరోగ్యపర్య వేక్షకులు శోభా కుమారి, రామారావు స్టాఫ్ నర్స్ రమాదేవి ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీశ్, వైద్య సిబ్బంది ఓబులేష్,వెంకట విజయకుమారి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సంఘటన లో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి

### –పులివెందుల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

ప్రజాభూమి, పులివెందుల



ప్రభుత్వ వైఫల్యమే తొక్కిసలాటకు దారి తీసినట్లు తెలుస్తోంది. తొక్కిసలాటలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి భక్తులు మృతి చెందడం పై కాంగ్రెస్ పార్టీ పులివెందుల మండల అధ్యక్షుడు తుమ్మలూరు అనిల్ కుమార్ రెడ్డితీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం టోకెన్లు జారీ చేస్తున్న సందర్భంలో శ్రీవారి భక్తులు తొక్కిసలాటలో చనిపోవడం చాలా దురదృష్టకరం అన్నారు.భక్తులకు అందించే సేవలు అత్యంత పవిత్రమైనవి అన్నారు.శ్రీవారి భక్తులకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసి ఉంటే ఇలాంటి సంఘటన జరిగే అవకాశం ఉండేది కాదన్నారు.పరమపవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజు దర్శనానికి లక్షలాది మంది భక్తులు వస్తారు అని తెలిసినా కూడా ఎందుకు ఏర్పాట్లు చేయలేకపోయారు అని ఆయన ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యం వల్లే తిరుపతిలో ఇలాంటి దుర్ఘటన జరిగింది అన్నారు. చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఎక్స్గ్రేషియా ప్రకటించి వారి కుటుంబాలకు టీటీడీలో శాశ్వత ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలి.గాయపడిన భక్తులను మెరుగైన వైద్యం అందించి వారికి టీటీడీ, అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి

ప్రజాభూమి పోరుమామిళ్ల:




పోరుమామిళ్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్, పిసిసి సభ్యులు అన్వర్ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షురాలు, బద్వేల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎన్ డి విజయ జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని, అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హెూం మంత్రి అమీషా కు రాసిన లేఖను అంబేద్కర్ పాదాల వద్ద ఉంచి, నిరసన తెలుపుతూ ! అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి మాట్లాడుతూ ! ఈనెల 9 నుంచి 26వ తేదీ వరకు ప్రతి పల్లె నుంచి ఢిల్లీ వరకు వాడ , వాడలా నిరసన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపడతుందని, అమిత్ షా రాజీనామా చేసే వరకు ఈ పోరాటం ఆగదని, భారత రాజ్యాంగ స్థానంలో మను సిద్ధాంతాన్ని అమలు చేయాలని చూస్తున్న బిజెపికి ,ప్రజలే బుద్ధి చెప్తారని జాతీయ నాయకుల్ని తూలనాడటం మహిళలని తూలనాడటం, బిజెపి నాయకులకు పరిపాటిగా మారిందని, కేంద్ర హెూం మంత్రి అమీషా రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా అన్వర్ మాట్లాడుతూ ! అంబేద్కర్ పై వ్యంగ్య వ్యాఖ్యలు చేసిన, రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ కార్యకర్తలు ముజాహిద్, ఫయాజ్ , రామ్మూర్తి ,శీను భాష తదితరులు పాల్గొన్నారు.

## కోవరంగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాభూమి, పులివెందుల(సింహాద్రిపురం)



తెలుగువారి ఇంట పాడిపంటలు వెల్లివిరిసే సందర్భంగా సకుటుంబ సపరివారంగా బంధు మిత్రులతో స్నేహితులతో కలిసి సంబరంగా జరుపుకునే తొలి పండగ సంక్రాంతి.ఈ పండుగ ప్రాశస్త్యాన్ని, సంస్కృతీ సాంప్రదాయాలను మన చిన్నారులకు పాఠశాల స్థాయి నుండే తెలియజేసే విధంగా, సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబ రాలను ప్రధానోపాధ్యాయులు రామసుబ్బారెడ్డి పర్యవేక్షణ లో ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర సౌజన్యంతో ఘనంగా గురువారం నిర్వహించారు. ముందుగా పాఠ శాల ప్రాంగణం అంతా విద్యార్థులు, ఉపాధ్యా యులు సంయుక్తంగా వివిధ రంగవల్లుల తో, గొబ్బె మ్మలతో మామిడి తోరణాలతో,అందంగా అలంకరించడం జరిగింది, తరువాత ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథు లుగా సింహాద్రిపురం మండల విద్యాశాఖధికారి –2 శారదదేవి సంక్రాంతి పండగ సంబరాలను టెంకాయలు కొట్టి పూజలు ప్రారంభిం చిన తర్వాత ఆమె ఉపాధ్యాయులు కలిసి చిన్నా రులందరి తలల మీద రేగుపండ్లు పోసి ఆశీర్వదించారు.అనంతరం గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేత లకు శారదదేవి బహుమతులను అందజేశారు. తరువాత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో లక్ష్మీగౌరీ, ప్రశాంతి, అంజలి, మారుతీ,విశ్రాంత ప్రధానోపాధ్యా యులు రాజేశ్వర రెడ్డి , విద్యాకమిటీ చైర్మన్ శివ కుమార్, సురేంద్ర నాథ్ రెడ్డి, అంగన్ వాడి కార్యకర్తలు సుబ్బలక్ష్మి, మమత,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ముక్కోటి ఏకాదశి ముస్తాబైన ఒంటిమిట్ట కోదండ రామాలయం

### భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా చలువ పందిళ్లు క్యూ లైన్లు ఏర్పాట్లు ఏర్పాట్లను పరిశీలించిన జమ్మలమడుగు డిఎస్పి శ్రీనివాసరావు

ప్రజా భూమి ఒంటిమిట్ట:







రెండవ అయోధ్య పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయం ఆంధ్ర భద్రాచలం ఏకశిలా నగరం గా పేరుగాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం నాడు జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా టీటీడీ పర్యవేక్షకులు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా చలవ పందిళ్లు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు టిటిడి అధికారులు, మరియు, జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు స్థానిక అధికారులతో కలిసి చర్చించారు ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చటి మామిడి తోరణాలతో ,అరటి పిలకలతో,వివిధ రకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరిస్తున్నారు. అదేవిధంగా ముక్కోటి పర్వదినం రోజు వేకువ జామున నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్తర గాలిగోపురం ఆధ్వర్యంలో ఆలయంలోనికి ప్రవేశించే ముందు గరుత్మంతుని వాహనంపై కొలువుదీరిన శ్రీ సీతా లక్ష్మణ సమేతుండై శ్రీ కోదండ రామస్వామి వారిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివస్తారు ఈ నేపథ్యంలో అత్యంత సౌకర్యవంతంగా తూర్పు భాగం నుంచి ఉత్తర భాగం గాలిగోపురం వద్దకు వచ్చేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వేకువజాముననే ఆలయ అర్చకులు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామి ఉత్సవ వరులను అభిషే కాలు, నిర్వహించి నూతన వస్త్రాలతో, కనక భూషణ పుష్ప మాలికలతో, దేదీప్యమానంగా అలంకరించి గరుత్మంత వాహనంపై ఉత్తర గాలిగోపురం వైపు ఆ సీన్లను భావించెదరు ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివార్ల దర్శన భాగ్యాలను కల్పిస్తున్నారు. అనంతరము గ్రామ పురవీధుల్లో శ్రీ సీత లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను పల్లకిపై గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగము పంపిణీ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వైకుంఠ ఏకాదశి పర్వ దినం రోజు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలిగించకుండా టీటీడీ పాలకమండలి పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్కు ఎటువంటి అంతరాయం లేకుండా వాహన నిలుపుదల సౌకర్య ప్రాంతాలను ఏర్పాటుచేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



## ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రజాభూమి పోరుమామిళ్ల:



పోరుమామిళ్ల పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హై స్కూల్ నందు గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను కరస్పాండెంట్ రంగాచారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటు వంటి మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ భారతీయ సాంప్రదా యాలు సంస్కృతులు గురించి వివరిస్తూ సంక్రాంతి పర్వదినం గురించి, భోగి సంక్రాంతి కనుమ రోజుల విశిష్టతను తెలియజేస్తూ సూర్యుడు మకర రాశి ప్రవేశంతో ఉత్తరాయన పుణ్యకాలం సంక్రాంతి పండుగ తో ప్రారంభమవుతుందని , తద్వారా వాతావరణంలో కలిగే మార్పులను దాని వల్ల కలిగే అనుకూల మరియు ప్రతికూల పరిస్థితులను విద్యార్థులకు వివరిస్తూ , వచ్చే వేసవిలో ఆరోగ్యం పట్ల ఎలా శ్రద్ధ చూపాలో వివరిస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చదువుతోపాటు మంచి ఆరోగ్యం కూడా అవసరమని రోజులో కాస్త సమయం అయిన ఫిజికల్ ఫిట్నెస్ కి కేటాయించాలని పెద్దవారిపట్ల వినయంగా ప్రవర్తించాలని, మనం ప్రకృతికి ఏమిస్తే దానినిబట్టే ప్రకృతి మనకి ఫలితాన్ని ఇస్తుంది కాబట్టి ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు నాడు తప్పనిసరిగా ఒక మొక్కనైనా నాటాలని అందువల్ల కలిగే ప్రయోజనాలను విద్యా ర్థులకు తెలియపరచడమే కాకుండా ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీలలో పాల్గొన్నటువంటి విద్యార్థినులకు మరియు ఆటల పోటీలలో పాల్గొన్నటువంటి విద్యార్థులందరికీ బహుమతి ప్రధానం చేయడం జరిగింది.



## అమిత్ షా దేశ ప్రజలకు క్షమా పణలు చెప్పాలి, మంత్రి పదవికి రాజీనామా చేయాలి

### కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్

ప్రజాభూమి,కడప సిటీ:




గురువారం ఉదయం కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య కొత్త బస్టాండ్ కోడలి నందుగల అంబేద్కర్ విగ్రహాని కి కేంద్ర హెూం మంత్రి అమిత్షా పేరున రాజీనామా పత్రాన్ని అంబేద్కర్ పాదాల వద్ద పెట్టి నిరసన కార్యక్రమం వ్యక్తపరి చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో డా క్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసి న సిగ్గుమాలిన వ్యాఖ్యలపై యావత్భారతదేశంరగిలిపోతున్న తరుణంలో, ప్రాంతాలకు అ తీతంగా ఆయన చేసిన వ్యా ఖ్యలను ఖండిస్తున్న క్షణంలో కాంగ్రెస్ ప్రజా పక్షాన నిలుస్తూ, ఎట్టి పరిస్థితుల్లో అమిత్ షా క్ష మాపణ చెప్పాలని, రాజీనా మా చేయాలని డిమాండ్ చే స్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బండి జకరయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రే ణులు పెద్ద ఎత్తున నిరసన వ్య క్తం చేశారు.అమిత్ షా దేశ ప్ర జలకు క్షమాపణ చెప్పి, తక్షణ మే రాజీనామా చేయాలని అం బేద్కర్ పాదాల వద్ద రాజీనా మా లేఖను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధా న కార్యదర్శి పఠాన్ మహమ్మ ద్ అలీ ఖాన్,సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామి ళ్ళ నరసింహులు,అబ్దుల్ సత్తా ర్,మల్లెం విజయభాస్కర్,సంజ య్ కాంత,కుళ్లాయప్ప, నాగర త్నగౌడ్, ఏకాదశి భువన్ రెడ్డి, సిరాజుద్దీన్,హరిప్రసాద్, దస్తగి రి పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి: తొక్కిసలాట- ఎవరి పాపం - ఎవరికి శాపం

### భక్తుల మరణాలకు బాధ్యత ఎవరు

### రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి డిమాండ్

ప్రజాభూమి, పులివెందుల



తిరుమల స్వామి వారి వైకుంఠ ద్వారా దర్శనం కోసం వచ్చిన భక్తుల తోపులాట, తొక్కిసలాట కారణంగా ఆరుగురు మరణించడం అత్యంత బాధాకరమైన విషయమని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. స్వామి వారి దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇది తగదని పేర్కొన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనా మా చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు.అధికార పార్టీ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సేవలో తరిస్తూ, సామాన్య భక్తుల మరణాలకు పరోక్షంగా కారణ మైన టీటీడీ పాలకమండలి మొత్తం రద్దు చేయాల ని చైర్మన్ వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేశారు

ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు టీటీడీ అధికారులు కానీ, పాలకమండలి కానీ ఉత్తుత్తి ప్రచారానికి ఇస్తున్నంత సమయం ఏర్పాట్ల కోసం ఇవ్వలేదు అనిపిస్తుంది. టోకెన్లు జారీ కేంద్రాలు సమాచారం సరిగా లేదు, లక్షలాది భక్తులకు తగిన ఏర్పాట్లు లేవు, భక్తుల భద్రత విషయంలో జాగ్రత్తలు లేవు, ఇంకా దర్శనాలు ఆరంభం కాకుండానే ఈ ఘటన జరగడం దురదృ ష్టకరం మృతుల కుటుంబాలకు టీటీడీ తరపున ఆదుకోవాలి.. వీలైతే వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు నష్టపరిహారం,టీటీడీలో ఉద్యోగాలు ఇవ్వాలి అలాగే రానున్న రోజుల్లో ఏ ఒక్క ప్రాణము పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మొత్తం టీటీడీ పాలకమండలి, ప్రభుత్వం పై ఉంది. దీనిలో ఏమాత్రం అలసత్వం తగదు, వైకుంఠ ద్వారా దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ వీఐపి తాకిడి, సేవ తగ్గించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

## విద్యార్ధులకు పద్య పోటీలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్
పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వేమన శతకం పై పద్య పోటీలను నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం ఆధ్వర్యంలో ఈ పద్య పోటీలు జరిగాయి. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు వేమన పద్య పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ పద్యం చెప్పిన విద్యార్థులను విద్యార్థులుగా ఎంపిక చేశారు. ఇందులో ఆరవ తరగతి చదువుతున్న సి.వైష్ణవి ప్రథమ స్థానంలో నిలువగా వెంకటగిరి ద్వితీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా ఎనిమిదో తరగతి విద్యార్థి చరణ్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు షీల్డ్ లో అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ముని వెంకటప్ప, ఉపాధ్యాయులు పిటిరామిరెడ్డి పాల్గొన్నారు.

## చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ప్రజా భూమి, అనంతపురం
విడపనకల్లు ఏ.పి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, బాల్య వివాహాలు-అనర్థాలు, మత్తు పదార్థాలు- దుష్పరిణామాలు, సైబర్ మోసాలపై అవగాహన చేసిన విడపనకల్లు పోలీసులు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు విడపనకల్లు ఎస్సై ఖాజా హుస్సేన్ తో కలసి అవగాహన కల్పించి, చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉరవకొండ రూరల్ సీఐ చిన్న గౌస్ కోరారు. ఏ సహాయం కావాలన్నా ఏ క్షణమైనా పోలీస్ వారు మీకు తోడుగా ఉన్నారని ఎలాంటి సమస్య అయిన డయల్ 100/112 నెంబర్లకు తెలియజేసి తక్షణ రక్షణ పొందవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విడపనకల్లు పోలీసులు విద్యార్థులు పాల్గొన్నారు

## లేపాక్షి పీహెచ్సీలో గర్భవతులకు వైద్య పరీక్షలు

### పౌష్టికాహారం అందజేసిన చైర్మన్ రమానందం



ప్రజాభూమి, లేపాక్షి:
మండల కేంద్రమైన లేపాక్షి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో 74 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, గర్భవతులు మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురికారాదన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వ్యాక్సిన్లను నియమం ప్రకారం వేసుకోవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గర్భవతులకు సూచించారు. డాక్టర్ల సలహా మేరకే గర్భవతులు నడుచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం లేపాక్షి వీరభద్రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చోళ సముద్రం కరణం రమానందం ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తన తల్లి పేరు మీద గర్భవతు లకు పౌష్టికాహారాన్ని అందించడం తనకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తన జీవితకాలం గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ సుబ్రహ్మణ్యం, సి హెచ్ ఓ సీతా మహాలక్ష్మి, పీహెచ్ఎం భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


## రాగి పంట సాగుపై ప్రత్యేక శ్రద్ధ కన పరచండి

### - ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్



ప్రజా భూమి, లేపాక్షి
మండల పరిధిలో రాగి పంట సాగు విస్తీర్ణం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచవలసిన అవసరం ఎంతైనా ఉందని హిందూపురం డివిజన్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఆల్తాఫ్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందించారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా రాగి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాగికి కనీస మద్దతు క్వింటాలు ధర 4290 రూపాయలకు పెంచిందన్నారు అదేవిధంగా రబీలో రాగి పంటకు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రబీ సీజన్లో రైతులు పండించిన కంది పంటకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 7550 రూపాయలు మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. రైతులు వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ రబీ సీజన్లో వరి పంటకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించేందుకు జనవరి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువును పొడిగించిందని, వెంటనే సంబంధిత రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. అంతేకాకుండా రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను కూడా పంపిణీ చేస్తున్నట్లు ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీలత, ఏఈఓ పుష్పలతతో పాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా నేత టిడిపిలో చేరిక



ప్రజా భూమి, లేపాక్షి:
మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత లక్ష్మీనరసన్న లేపాక్షి మండల టిడిపి కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మానేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పాపిరెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మి నరసన్న టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చక తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న రాష్ట్ర అభివృద్ధి పనులు తనను ఎంతగానో ఆకర్షించాయన్నారు. త్వరలో అధిక సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామచంద్ర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జయంతిపై ప్రకటన హర్షణీయం -కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వడ్డెర్లు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ప్రకటన చేయడం హర్షణీయమని వడ్డెర్ల సంఘం నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక శ్రీకంఠపురం సర్కిల్ లో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి వడ్డెర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ, మొదటి తరం స్వతంత్ర సమర యోధుడు రేనాటి వీరుడు వడ్డే ఓబన్నగా పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని జిఓ విడుదల చేయడం పై తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట



అంజినప్ప, బీసీ సెల్ అధ్యక్షులు, శ్రీకంఠపురం వడ్డెర సంఘ నాయకులు దుర్గ నవీన్, దుర్గ నాని, వడ్డే ప్రసాద్, సంఘం అధ్యక్షులు వడ్డే రంగప్ప, అక్కులప్ప, నాగరాజు, సునీల్ కుమార్, వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రం లో ఉన్న వడ్డెర్ల ను గుర్తించి ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న జయంతిని ప్రతి ఏటా జనవరి 11 వ తేదీన అధికారికంగా నిర్వహించాలని ప్రకటన చేయడం ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని కోరారు. వడ్డెరలను గుర్తించిన రాష్ట్ర కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రులు నారా లోకేష్, సవితమ్మ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వడ్డెర సంఘం నాయకులు పరిగి హనుమప్ప, శివ, గోవింద,మంజునాథ్, నందీష్, గంగాధర్, గురుశంకర్, జయచంద్ర, మురళి, హర్షవర్ధన్, శివ,వెంకటరమణప్ప, కెంచప్ప, చరణ్ పాల్గొన్నారు.

## మైదుగోళం యు పి పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చండి

### టిడిపి మండల కన్వీనర్కు వినతి


ప్రజాభూమి, లేపాక్షి:
మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు గ్రామమైన మైదుగోళంలో వెలసిన ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చేందుకు కృషి చేయాలని పాఠశాల కమిటీ చైర్మన్ షాజహాన్, ఉపాధ్యాయులు కన్వీనర్ జయప్పకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుండి 8 తరగతులు నడుస్తున్నాయన్నారు. దాదాపు 134 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 8వ తరగతి తరువాత తొమ్మిదవ తరగతికి వెళ్లాలంటే దాదాపు పది కిలోమీటర్ల దూరంలోని లేపాక్షి వి జెడ్ పి ఉన్నత



పాఠశాలకు గాని లేదా కర్ణాటక ప్రాంతానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీంతో అధిక సంఖ్యలో విద్యార్థులు 8వ తరగతి తరువాత ఉన్నత పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. పైగా మైదు గోళం గ్రామం నుండి ప్రధాన రహదారికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. గ్రామం నుండి రవాణా సదుపాయం కూడా సమయానికి లేకపోవడం విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు శాపంగా మారిందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చుకునేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. వెంటనే మైదు గోళం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల గా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అందుకు స్పందించిన కన్వీనర్ జయప్ప ఈ విషయాన్ని వెంటనే హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి మైదుగోళం గ్రామంలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## వైకుంఠ ఏకాదశి రోజున జిల్లాలోని దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

**దేవాలయాలు, పరిసరాలలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల చర్యలు**
**భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు విధుల కోసం పోలీసు సిబ్బంది కేటాయింపు**
**జిల్లా ఎస్పీ జగదీష్**



ప్రజా భూమి బ్యూరో, అనంతపురం
వైకుంఠ ఏకాదశి రోజైన శుక్రవారం జిల్లాలోని దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. దేవాలయాలు, పరిసరాలలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు విధుల కోసం పోలీసు సిబ్బందిని కేటాయించామన్నారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేసుకునే విధంగా దేవాలయ కమిటీలకు సూచించామన్నారు. భక్తులు తాకిడి అధికంగా ఉన్న దేవాలయాల వద్ద బ్యారికేడింగ్, క్యూ మెయింటెనెన్స్ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దేవాలయాలు, పరిసరాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తుతో పాటు ఆయా పరిసరాలలో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా వేశామన్నారు. గస్తీ పెంచామన్నారు. మొబైల్ సెక్యూరిటీ హ్యాండ్ హెల్డ్ డివైస్ (పాపిల్లాన్ మొబైల్ డివైస్) ద్వారా అనుమానితులను చెక్ చేయనున్నారని తెలిపారు.

## కూటమిప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు: పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాభూమి,పుట్టపర్తి:
రాష్ట్రంలో ఉన్న లక్షలాది జనాభా కలిగిన వడ్డెర్ల ఆరాధ్య దైవం తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా ప్రకటించినందుకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు కుటుంబ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర్ల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న జయంతి జనవరి 11న రాష్ట్ర పండుగల నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 19 న అసెంబ్లీ లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వడ్డెర్లకు మద్దతుగా ప్రస్తావించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో వడ్డెర్ల ఆరాధ్య దైవం తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా గుర్తించాలని అసెంబ్లీ లో ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు సత్వరమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితా,కూటమి ప్రభుత్వ ఉన్నతాధికారులు వేగంగా అడుగులు వేసి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వం జీఓ నెంబర్ 05 ను విడుదల చేసి జనవరి 11 న అన్ని జిల్లా



కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా జరపాలని ఈ నెల 08.01.25 న అన్ని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. అడిగిన వెంటనే 50 రోజుల్లోనే వడ్డెర మనోభావాలు గుర్తించి జీవో జారీ చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు , డిప్యూటీ సీఎం పవన్ కు ,మంత్రి సవితా కు , పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి రాష్ట్ర వడ్డెర కులస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర హక్కుల కోసం పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి నందుకు రాష్ట్ర వడ్డెర్లందరూ కూటమి ప్రభుత్వాన్ని ,ముఖ్య మంత్రి చంద్రబాబు ను ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ,ఈ ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.వడ్డెర్ల దైవంగా భావించే వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో నవంబర్ 19 న పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన వెను వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,మరియు కూటమి ప్రభుత్వానికి ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితామ్మ కు , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి ,రాష్ట్ర వడ్డెర కులస్తులు ,మరియు సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు కొల్లకుంట్ల అంజినప్ప ,రాష్ట్ర టీడీపీ మీడియా ఇన్ ఛార్జ్ వెంకట రాముడు తోపాటు పలువురు టీడీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.
ముఖ్యమంత్రి చంద్రబాబుకి , డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కి ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకి , ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ,ప్రభుత్వ రాష్ట్ర ఉన్నతాధికారులకు రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, వలిపీ శ్రీనివాసులు,పీట్ల సుధాకర్ , వల్లపు సోమశేఖర్,అంజనప్ప , ఎంపీటీసీ శ్రీనివాసులు ,ప్రసాద్ , రామచంద్ర ,కుంచేపు శ్రీనివాసులు, ఇడగొట్టు ఆంజనేయులు ,వెంకటేష్, వైదేహి, పీట్ల మనోహర్ తోపాటు పలువురు టీడీపీ కార్యకర్తలు అభిమానులు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు

## సాంప్రదాయ దుస్తులతో అలరించిన విద్యార్థులు

### పులమతి పాఠశాలలో ముగ్గుల పోటీలు.

ప్రజాభూమి ,లేపాక్షి
మండల పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన అందరిని అలరించింది. బాలురు సాంప్రదాయ దుస్తులైన గోచి, పంచె వస్త్రధారణతో అందరినీ అలరించారు. అదేవిధంగా బాలికలు చీరకట్టుతో అందరినీ ఆకట్టుకున్నారు. అదేవిధంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో సీనియర్, జూనియర్ బాలికలను రెండు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించడం జరిగింది. సంక్రాంతి పండుగ శోభ పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు





సుబ్బారావు మాట్లాడుతూ, తెలుగువారి ప్రాచీన సాంప్రదాయ పండుగ అయిన సంక్రాంతిని తెలుగు సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ఆనందదాయకంగా ఉందని పేర్కొన్నారు. ఈ సంక్రాంతి పోటీల్లో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టుదలతో శ్రమిస్తేనే విజయం సాధ్యం

### -వ్యక్తిత్వ వికాస నిపుణులు స్వామి బాలచంద్ర

ప్రజాభూమి, హిందూపురం టౌన్
విద్యార్థులు కష్టపడి కాకుండా పట్టుదలతో ఇష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధ్యమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సేవకులు స్వామి బాలచంద్ర పేర్కొన్నారు. హిందూపురం పట్టణం లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల పట్ల భయాన్ని తొలగించి ఆత్మస్థైర్యాన్ని నింపడం కోసం “గమ్యం” పేరిట స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి బాలచంద్ర మాట్లాడుతూ, విజయాన్ని సాధించడానికి శ్రమించడం తప్ప ఇతర అడ్డదారులేవి లేవని తెలియజేశారు. అభయ బిభవిత అనే కార్యక్రమం ద్వారా



ఆడపిల్లల స్వీయ రక్షణ గురించి,ఆడబిడ్డల అభ్యున్నతి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి సిద్ధగిరి శ్రీనివాస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, ఓరియంటల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబుళం , కృష్ణమోహన్ , ఫిజికల్ డైరెక్టర్ లోక్నాథ్, కార్యదర్శి రామాంజనేయులు, సీనియర్ ఉపాధ్యాయులు అమర నారాయణ రెడ్డిలతో పాటు వివిధ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

v Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 59-2-1,Ashoknagar 1st lane.Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh and Published from D.NO. 59-2-1,Ashoknagar1st lane,Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677